# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 11 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 39 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## కోర్టుల్లో రాజకీయ కొట్లాటలొద్దు

సీజేఐ హెచ్చరిక



2

## కార్పొరేట్ ఉద్యోగాలు వదిలేసి ఆటో డ్రైవర్‌గా



2

### అవిశ్వాసంపై చర్చ పూర్తయ్యేదాకా

# సభకు రాను

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం



ఢిల్లీ, ఫిబ్రవరి 10: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. తనపై విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యే వరకు సభకు దూరంగా ఉండాలని నిశ్చయించుకున్నారు. స్పీకర్‌ను పదవి నుంచి తొలగించేలా తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్ సభ సెక్రటరీ జనరల్ కు కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీంతోపాటు ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీపైనా చర్యలు చేపట్టలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని తెరపైకి తెచ్చాయి.

## ఏపీలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల



రాష్ట్రంలోని విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ తీపి కబురు అందించారు. రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బకాయిలు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.





# ఢిల్లీలో సీఎం బిజీ..బిజీ..

### వరుసగా కేంద్రమంత్రులతో భేటీ

### వివిధ అంశాలపై చర్చ

### రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని విన్నపాలు

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: సీఎం చంద్రబాబు ఢిల్లీలో సోమవారం బీజీ...బీజీగా గడిపారు. వరుసగా కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి తాము సానుకూలంగానే ఉన్నట్లు సీఎం చంద్రబాబు హామినిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి పలు అభివృద్ధికి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

#### నీటి ప్రాజెక్టులపై చంద్రబాబు

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ను కలిసి పోలవరం ప్రాజెక్టుతో సహా కీలకమైన నీటిపారుదల, నీటి భద్రతా ప్రాజెక్టులకు అనుమతులను వేగవంతం చేయాలని, ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కాపాడటానికి, రైతుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు సకాలంలో కేంద్ర మద్దతు చాలా కీలకమని చంద్రబాబు అన్నారు. పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలు, జాతీయ ప్రాజెక్టులలో వ్యయాల పెరుగుదల, దీర్ఘకాలంగా ఉన్న అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపై కేంద్రమంత్రితో చర్చించారు. పోలవరం ప్రాజెక్టుపై విధించిన స్టాప్-వర్క్ ఆర్డర్ను శాశ్వతంగా ఎత్తివేయాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. పోలవరం దశ-2 కోసం పూర్తి కేంద్ర నిధులను అభ్యర్థించారు. భూసేకరణ,

...మిగతా 2లో

# శివస్వాములకు దండనా?!

## స్వాములపై పోలీసుల లాఠీఛార్జీ



- ఆగ్రహం వ్యక్తం చేసిన స్వాములు
- భద్రతా సిబ్బంది విఫలం
- అదనపు బలగాల మోహరింపు
- వీఐపీలకు ప్రాధాన్యత ఇస్తున్న వైనం
- లాఠీఛార్జీని ఖండించిన బీజేపీ అధ్యక్షుడు

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం ఆలయంలో జనసమూహాన్ని అదుపు చేయడానికి పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. వేలాది మంది శివభక్తులు మల్లన్న దర్శనానికి వచ్చారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఐదు గంటల నుంచే భక్తులు, శివస్వాములు క్యూలైన్లలో

...మిగతా 2లో

### శివస్వాములకు క్షమాపణ చెప్పాలి: ఆరె శ్యామల



### లాఠీఛార్జీని ఖండించిన బీజేపీ అధ్యక్షుడు



### బంగ్లాదేశ్‌లో ఎన్నికలకు ముందు..

# మరో హిందూ వ్యాపారి హత్య

### మైనారిటీలపై పెరుగుతోన్న హింసాత్మక దాడులు



ఢాకా, ఫిబ్రవరి 10: బంగ్లాదేశ్ లో మైనార్టీ వర్గంపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫిబ్రవరి 12న ఆ దేశంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరో హిందువు హత్యకు గురవడం చర్చనీయాంశంగా మారింది. మిమెన్సింగ్ జిల్లాలో సోమవారం సుసేన్ చంద్రశేఖర్ (62) అనే హిందూ

...మిగతా 2లో

# పని జరిగింది.. ఫలితం మాత్రం దక్కలేదు

### అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందం వల్ల బంగ్లాదేశ్‌కు 1 శాతం మాత్రమే సుంకాలు తగ్గినయ్

ఢాకా, ఫిబ్రవరి 10: ఎన్నో రోజులుగా చర్చల్లో నలుగుతున్న అమెరికా-బంగ్లాదేశ్ మధ్య ట్రేడ్ అగ్రిమెంట్ పై ఎట్టకేలకు సోమవారంసంతకాలు జరిగాయి. అయితే, దీని వల్ల బంగ్లాదేశ్‌కు ఫలితం మాత్రం 1 శాతమేనని వార్తలు వెలువడుతున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్‌పై అమెరికా విధించిన టారిఫ్ లు 20 శాతం నుంచి 19 శాతానికి తగ్గనున్నాయి. ఈ విషయాన్ని శ్వేతసౌధం ఓ ప్రకటనలో ధ్రువీకరించింది. ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ టెక్స్‌టైల్స్, అప్పెరల్స్ సరకులపై మినహాయింపులు పొందేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తుంది. అయితే అమెరికాలో తయారైన

...మిగతా 2లో



# హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 10: అమెరికాలో నివసిస్తూ ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది భారతీయ ఐటీ నిపుణులకు షాకిచ్చేలా అక్కడి చట్టసభలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధి గ్రెగ్ స్టూబ్ ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. 'ఎండింగ్ ఎక్స్‌ప్లాయిటేటివ్ ఇంపోర్టెడ్ లేబర్ ఎగ్జెంప్షన్స్ యాక్ట్' పేరుతో ఈ బిల్లును ప్రతిపాదించారు. అమెరికా

...మిగతా 2లో




# ఢిల్లీలో సీఎం బీజీ..బీజీ..



(మొదటి పేజీ తరువాయి)

పునరావాసం, నిర్వాసిత కుటుంబాల పునరావాసం, రక్షిత కట్టల నిర్మాణంతో కూడిన రెండో దశకు దాదాపు రూ.32,000 కోట్ల అదనపు కేటాయింపులు అవసరమని అన్నారు. గోదావరి వరద నీటిని ఆంధ్రప్రదేశ్లోని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడం లక్ష్యంగా ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఆమోదాలు, మద్దతు గురించి కేంద్రమంత్రితో చంద్రబాబు మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ తాగునీరు, నీటిపారుదల, పారిశ్రామిక అవసరాలను తీరుస్తుందని అన్నారు. జాతీయ నదుల అనుసంధాన విధానం కింద సాంకేతిక, ఆర్థిక మద్దతును ఆయన కోరారు.గో దావరి జలాల పంపకంపై తెలంగాణతో కొనసాగుతున్న విభేదాలను చంద్రబాబు ఎత్తి చూపారు. తెలుగు రాష్ట్రాల మధ్య సమాన కేటాయింపు జరిగేలా గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఎగువ కృష్ణా నదిపై ఉన్న ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచాలనే కర్ణాటక ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్లో నీటి లభ్యతపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలను చూపుతుందని చెప్పారు.

### వైజాగ్కు మెట్రో

వైజాగ్కు మెట్రో వచ్చేస్తోంది. కేంద్రం నుంచి మెట్రో రైలు ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో విశాఖలో మెట్రో రైలు పరుగులు పెట్టనుంది. ఈ ప్రాజెక్టు పనులు పట్టాలెక్కి కంప్లీట్ అయితే బీచ్ సిటీలో ప్రయాణం మరింత సులభం అవుతుంది. ఈ విషయాన్ని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబుకు కేంద్ర ప్రట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ స్వయంగా తెలియజేశారు. వైజాగ్, విజయవాడంలో మెట్రో నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను గతంలోనే కేంద్రానికి రాష్ట్రం పంపింది. మొదట వైజాగ్లో మెట్రో నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్తో...

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని మరో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్రం మార్గనిర్దేశం చేయాలని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో మంగళవారం సమావేశమయ్యారు. ఈ భేటీ చాలా ఫలప్రదంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. 'దేశ వ్యవసాయ జీడీపీలో ఆంధ్రప్రదేశ్ వాటా 9.9 శాతంగా ఉంది. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రమంత్రి సలహాలు, సూచనలు కోరాను. మా విజ్ఞప్తి మేరకు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఒక యాక్షన్ ప్లాన్, వాల్యూ-ఎడిషన్ ప్లాన్ను సిద్ధం చేయాలని శివరాజ్ సింగ్ తన శాఖ అధికారులను ఆదేశించారు' అని వెల్లడించారు. త్వరలో కేంద్ర బడ్జెట్ రానున్న నేపథ్యంలోనే అన్ని శాఖల మంత్రులతో సమావేశమవుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా దాదాపు 10 శాతం ఉందని ప్రశంసించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం హార్టికల్చర్ హబ్గా ఎదుగుతోందని, బడ్జెట్లో ప్రకటించిన పథకాలను వేగంగా అమలు చేస్తోందని కొనియాడారు. ఈ భేటీపై సీఎంవో కూడా ప్రకటన చేసింది. అందులో పేర్కొన్న మేరకు... రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చంద్రబాబు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో చర్చించారు. సేంద్రీయ సాగుపై ప్రత్యేక దృష్టి సారించామని, 2024-25 సంవత్సరంలో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని చంద్రబాబు ఆయనకు తెలిపారు.

### కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్తో...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్తో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే లక్ష్యంతో పలు కీలక ప్రాజెక్టులు, కొత్త సర్వీసులు, మౌలిక వసతుల కల్పనపై ఆయనతో చర్చించారు. ఈ మేరకు సమగ్రమైన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. విజయవాడ-బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వెళ్లేలా వందేభారత్ రైలును కేటాయించాలని కోరారు. ఇటీవల కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏపీని తాకుతూ ప్రకటించడంపై చంద్రబాబు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో, బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైలు మార్గాన్ని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా కోరారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రారంభించేలా తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే సరకు రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్పీటీ పోర్టుకు అరటిపండ్ల ఎగుమతికి వీలుగా, 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లను కేటాయించాలని కోరారు. అలాగే ఉత్తర-దక్షిణ భారతాలను కలిపే ఇటార్సీ-విజయవాడ ప్రత్యేక సరకు రవాణా కారిడార్కు, ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్పూర్-చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని ప్రతిపాదించారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీని పెంచేందుకు కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. హైదరాబాద్-శ్రీశైలం-మార్కాపురం మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ-బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ సర్వీసును నడపాలని చంద్రబాబు కోరారు. విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుప్పంలో పలు ఎక్స్ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడంతో పాటు, అక్కడ రైలు బోగీల నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని కూడా రైల్వే మంత్రిని కోరారు. సీఎం వినతులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

### పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ తో...

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఉక్కు శాఖా మంత్రి హెచ్డీ కుమారస్వామితో వేర్వేరుగా భేటీ అయ్యారు. మనోహర్ లాల్ ఖట్టర్తో సమావేశమైన చంద్రబాబు, రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిని ఆయనకు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా రాష్ట్రంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యర్థాల నిర్వహణకు (వేస్ట్ మేనేజ్మెంట్) ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని 'జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్'గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద రూ. 276 కోట్ల అంచనా వ్యయంతో ఈ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించామని, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 105 కోట్లను వెంటనే మంజూరు చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

### కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్డీ కుమారస్వామితో...

కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్డీ కుమారస్వామితోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) తిరిగి లాభాల బాట పట్టడంపై కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక చేయూత, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు, అలాగే స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగుల అవిరళ కృషితోనే ఇది సాధ్యమైందని కుమారస్వామికి వివరించారు. ప్రస్తుతం వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడమే కాకుండా, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ఐఎన్ఎల్ విషయంలో భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం ఇదే రకమైన తోడ్పాటును, సహకారాన్ని కొనసాగించాలని కోరారు. ఈ భేటీల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, సహకారాన్ని సాధించేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# మరో హిందూ వ్యాపారి హత్య

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారిని గుర్తు తెలియని దుండగులు తన దుకాణంలోనే కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం రాత్రి చంద్రశేఖర్ తన బియ్యం దుకాణంలో ఉండగా లోపలికి చొరబడిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆయన అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నిందితులు తాపీగా దుకాణం షట్టర్ను మూసేసి పరారయ్యారు. అనంతరం దుకాణానికి వచ్చిన చంద్రశేఖర్ కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరో రెండు రోజుల్లో బంగ్లాదేశ్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హిందూ వ్యాపారి హత్యకు గురవడం గమనార్హం. ఆ దేశంలో హిందువుల భద్రత పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

# పని జరిగింది.. ఫలితం మాత్రం దక్కలేదు

(మొదటి పేజీ తరువాయి)

కాటన్ ఉపయోగించేందుకు బంగ్లాదేశ్ అంగీకరించినట్లు ఆ దేశ సలహాదారు మహమ్మద్ యూనస్ స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. గతంలో బంగ్లాదేప్ ట్రంప్ 37శాతం టారిఫ్లు విధించగా..

ఆ తర్వాత దానిని 20 శాతానికి తగ్గించారు. అయితే, తాజా ఒప్పందం ప్రకారం మరొక శాతం తగ్గించి 19 శాతం వద్ద స్థిరీకరించారు. భారత్-అమెరికా వాణిజ్యఒప్పందం 18 శాతం టారిఫ్ల వద్ద కుదరడంతో.. వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థికవ్యవస్థ అయిన బంగ్లాదేశ్లో కంగారు మొదలైంది. దీంతో దేశంలో ఎన్నికల వేళ భారత్ కంటే తక్కువ టారిఫ్లతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు యత్నించింది. ఈ క్రమంలో అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, మెడికల్ పరికరాలు, ఆటోపార్టులు, ఇంధన ఉత్పత్తులకు బంగ్లాదేశ్ మార్కెట్ నుతెరిచేందుకు అంగీకరించింది.

# హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు!




(మొదటి పేజీ తరువాయి)

ఇమ్మిగ్రేషన్ చట్టాలను సవరించి హెచ్-1బీ వీసా విధానానికి పూర్తిగా స్వస్తి పలకడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. అమెరికా పౌరుల సంక్షేమం కంటే విదేశీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వడం అమెరికా జాతి ప్రయోజనాలకు విరుద్ధమని గ్రెగ్ వాదిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు తక్కువ వేతనాలకే విదేశీయులను తెచ్చుకుంటూ అమెరికా యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను హరిస్తున్నాయని, అమెరికా పిల్లల కోసం 'అమెరికన్ డ్రీమ్'ను కాపాడాలంటే ఈ దోపిడీని అరికట్టాలని చెబుతున్నారు. అందుకే ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే అమెరికాలో స్థిరపడాలనుకునే లక్షలాది మంది భారత టెకీల ఆశలపై నీళ్లు చల్లినట్లే. హెచ్-1బీ వీసా పొందుతున్న వారిలో 80 శాతానికి పైగా భారతీయులు, చైనీయులే ఉంటున్నారు. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేసింది. కొత్త వీసాలపై 1,00,000 డాలర్ల భారీ రుసుమును విధించి షాక్ ఇచ్చింది. పైగా లాటరీ విధానానికి బదులు ఎక్కువ జీతం ఇచ్చే ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తక్కువ జీతం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు వీసా ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఫిబ్రవరి 27 నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. ట్రంప్ ప్రభుత్వ కఠిన విధానాలకు తోడు ఈ కొత్త బిల్లు అమెరికా వెళ్లాలనుకునే భారతీయుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# శివస్వాములకు దండనా?!

(మొదటి పేజీ తరువాయి)

వేచి ఉన్నారు. గంటలు గడుస్తున్నా.. క్యూ లైన్లు ముందుకు జరగలేదు. దీంతో భక్తుల్లో అసహనం మొదలైంది. కనీసం తాగేందుకు కూడా నీరు లేదని ఆగ్రహం వ్యక్తమైంది.అధికారిక నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం ఆలయ ప్రాంగణంలో ధర్నా చేపట్టారు.

### లాఠీఛార్జీని ఖండించిన బీజేపీ అధ్యక్షుడు

శ్రీశైలంలో శివస్వాములపై జరిగిన లాఠీచార్జీని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ తీవ్రంగా ఖండించారు. పోలీసుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. భక్తులకు వసతులు కల్పించాలని ఆయన కోరారు.

### శివస్వాములకు క్షమాపణ చెప్పాలి: ఆరె శ్యామల

శ్రీశైలం క్షేత్రంలో శివస్వాములపై లాఠీఛార్జీ చేయడం అత్యంత హేయమైన చర్య అని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల వెల్లడించారు.. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, స్వాములపై పోలీసుల తీరు చాలా బాధకరమన్నారు. స్వాములపై లాఠీ ఝులిపించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, వెంటనే శివస్వాములకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శివస్వాములకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని లేని పక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

### భద్రతా సిబ్బంది విఫలం..

ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడంలో భద్రతా సిబ్బంది విఫలమైంది. దీంతో పోలీసులు



పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో భక్తులు, శివస్వాములపై లాఠీఛార్జీ చేశారు. శివస్వాములపై పోలీసులు లాఠీఛార్జీ చేయడం పట్ల నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల దాడిలో పలువురు శివస్వాములు గాయపడ్డారు. ఈ క్రమంలో భక్తులు పరుగులు తీయడం, తోపులాట జరిగింది.

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్వాములు..

ఘటనపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల పరిస్థితి తలెత్తిందని, సామాన్య భక్తుల రక్షణను గాలికి వదిలేశారని ఆరోపిస్తున్నారు. క్యూ లైన్లలో తాగునీరు, కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని, సహాయం చేయాల్సిన యంత్రాంగం దాడులకు దిగడం అమానుషమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివస్వాముల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించడం భక్తుల మనోభావాలను దెబ్బతీసింది.

### అదనపు బలగాల మోహరింపు...

శ్రీశైలంలోఅదనపు బలగాలను మోహరించాయి. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. అయినా భక్తుల్లో నెలకొన్న ఆగ్రహం తగ్గలేదు. భక్తులకు భద్రత కల్పించాల్సిన అధికారులు మేల్కొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### కనీస సౌకర్యాలు కరువు...

మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలు కరువు అయ్యాయి. స్వామి దర్శనానికి గంటల సమయం పడుతోంది. క్యూలైన్లో ఉన్న వారికి కనీసం తాగునీరు ఇవ్వడం లేదని శివస్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివదీక్షను పాటించే భక్తులు, సాధారణ యాత్రికులు సరిపోని ఏర్పాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అసలు ఏం జరిగింది...

దర్శనం కోసం ఎదురుచూసే కొందరు భక్తులు ఉక్కపోత, నీరసంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని భక్తులు ఆరోపించారు. ఆలయ ఈవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాసేపటికే పరిస్థితి చేయిదాటి పోయింది. శివస్వాములు క్యూలైన్ల నుంచి బయటకు వచ్చి నిరసన తెలియజేశారు. దీంతో మల్లన్న ఆలయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఎస్పీ సునీల్, ఏఎస్పీ యుగంధర్ బాబు రంగంలోకి దిగారు. భక్తుల ఆగ్రహంతో ఉన్నారు. దీంతో పోలీసులు అదుపుచేసేందుకు స్వల్ప లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే ఏఎస్పీ యుగంధర్ బాబు లాఠీతో భక్తులను బెదిరిస్తూ, వారిని చెదరగొట్టే ప్రయత్నం చేసినట్టుగా వీడియోలో కనిపిస్తుంది. శివస్వాములపై పోలీసులు లాఠీలు లేపడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇక చేసేదేమీ లేక చాలా మంది శివస్వాములు రాజగోపురం నుంచే స్వామివారిని దర్శనం చేసుకోకుండానే వెనక్కు తిరిగారు. ఆలయ అధికారుల ప్రకారం, వేలాది మంది భక్తులు, ముఖ్యంగా శివ దీక్ష తీసుకున్నవారు తెల్లవారుజాము నుండే ఆలయం చేరుకున్నారు. కొంతమంది భక్తులు ముఖ్యంగా శివ స్వాములు.. క్యూ లైన్లలో ఎక్కువసేపు వేచి ఉండటంతో ఆందోళనకు గురై ఆలయ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిలో కొందరు బారికేడ్లను దాటి ఆలయ ద్వారాల వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు.

### వీఐపీలకు ప్రాధాన్యత ఇస్తూ...

పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వీఐపీలకు ప్రాధాన్యత ఇస్తూ తమను గంటల తరబడి వేచి ఉండమని బలవంతం చేశారని శివ స్వాములు ఆరోపించారు. శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణాధికారి . శ్రీనివాసరావు క్యూ లైన్ల వద్దకు చేరుకుని ఆందోళన చెందుతున్న భక్తులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. 11 రోజుల బ్రహ్మోత్సవాలలో మొదటి ఐదు రోజుల్లో శివ దీక్ష భక్తులకు మాత్రమే స్పర్శ దర్శనం అనుమతిస్తామని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. ఇతర భక్తులకు కూడా దర్శనం కల్పించడానికి శివ దీక్ష భక్తులను రెండు గంటల పాటు నిలిపివేస్తారు. ఈ ప్రక్రియలో కొంతమంది భక్తులు అసహనానికి గురై గొడవ పడ్డారని అధికారులు తెలిపారు. శివ స్వాముల కోసం ప్రత్యేకంగా ఐదు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. క్యూ కాంప్లెక్స్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరం స్నాక్స్, బిస్కెట్లు, తాగునీరు అందిస్తున్నామన్నారు. అత్యవసర నిష్క్రమణలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. శివదీక్ష భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ నిర్వహణకు సహకరించాలని, ఓపికగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# డీకేకు సీఎం పదవి ఇవ్వాల్సిందే!

## కాంగ్రెస్ హైకమాండ్కు 80 మంది కర్నాటక ఎమ్మెల్యేల అభ్యర్థన

**బెంగళూరు, ఫిబ్రవరి 10:** కర్ణాటకలో సీఎం పోస్టుపై 'ఇష్యూ' కొనసాగుతూనే ఉంది. ఇప్పుడేమో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను సీఎం చేయమని 80 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్ ను అభ్యర్థించారు. తాజాగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం..'సీఎం పదవి విషయంలో డీకేకు ఒక ఛాన్స్ ఇవ్వాలని 80-90 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్ను అభ్యర్థించారు. ఇప్పుడు ఈ నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. మాది క్రమశిక్షణ కలిగిన పార్టీ. దానికి తగ్గట్టే మేం ప్రవర్తించాలి. ఆయన (యతీంద్ర సిద్ధరామయ్య) తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా ఉంది. కానీ రాజకీయాల విషయానికి వస్తే..



క్రమశిక్షణే ముఖ్యం. తమ వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదు. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలని మా అందరి కోరిక. కానీ దానిగురించి బహిరంగంగా ప్రకటనలు చేసి, గందరగోళం సృష్టించకూడదు'' అని ఇక్బాల్ మీడియాతో అన్నారు.

మరోవైపు, డీకే ఢిల్లీకి వెళ్తున్నారు. 'కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం కానున్నాను. అయితే ఎవరిని కలుస్తాననే విషయం మాత్రం చెప్పలేను. మీరెందుకు అంత ఆసక్తి చూపిస్తున్నారు. నేను డిప్యూటీ సీఎం పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్నాను. దాంతో ఈ సమావేశాలు సర్వసాధారణమే. అలాగే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో భేటీ కానున్నాను'' అని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు డీకే బదులిచ్చారు. ఎమ్మెల్యే ఇక్బాల్ వ్యాఖ్యల వేళ.. ఈ పర్యటన జరుగుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కార్పొరేట్ ఉద్యోగాలు వదిలేసి ఆటో డ్రైవర్గా

**బెంగళూరు, ఫిబ్రవరి 9:** బెంగళూరుకు చెందిన రాకేశ్ విపరీతమైన ఒత్తిడితో జాబ్ మానేసి.. వేరే ఉద్యోగంలో చేరినప్పటికీ అక్కడా కార్పొరేట్ ఒత్తిడులు, అవే పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో కార్పొరేట్ ప్రపంచానికి దూరమైన రాకేశ్.. అనంతరం స్వల్పకాలం పాటు పలు ఇతర ఉద్యోగాలు చేశాడు. దానితో శాలరీ సరిపోక తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నాడు. చివరికి ఒక ఆటో రిక్షా కొనుగోలు చేసి డ్రైవర్ గా మారాడు. ఈ పనిలో ఆశించిన స్థాయిలో సంపాదన లేకపోయినా.. మనశ్శాంతితో బతుకుతున్నట్లు రాకేశ్ చెబుతున్నాడు.

# కోర్టులో రాజకీయ కొట్లాటలొద్దు

- సీజేఐ హెచ్చరిక

**ఢిల్లీ, ఫిబ్రవరి 10:** న్యాయవ్యవస్థను ఉపయోగించుకొని పార్టీలు రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించవద్దని సుప్రీంకోర్టు హెచ్చరించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ 'గన్ వీడియో' పోస్టుపై అత్యున్నత న్యాయస్థానంలో విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్ట్ పార్టీలు కోర్టులో రాజకీయ పోరాటాలు చేయొద్దని పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ కొంత భాగం పోరాటాలు కోర్టుల్లోనే జరుగుతున్నాయని సీజేఐ అన్నారు.

# జపాన్లో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం పునఃప్రారంభం



**టోక్యో, ఫిబ్రవరి 10 :** ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కాషివాజాకి-కరీవా ప్లాంట్ను జపాన్ సోమవారం పునఃప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ఈ కర్మాగారం తిరిగి విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. 2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్లో ప్రమాదం సంభవించింది. దీంతో దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను జపాన్ ప్రభుత్వం మూసివేసింది. ఆ తర్వాతి పరిస్థితుల్లో.. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావించింది. 2050 నాటికి 'కార్బన్ న్యూట్రాలిటీ' సాధించడానికి, కృత్రిమ మేధ అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ను తట్టుకోవడానికి మళ్లీ అణుశక్తి వైపు మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో కాషివాజాకి-కరీవా ప్లాంట్ను పునఃప్రారంభించడానికి జనవరిలో మొదటిసారి ప్రయత్నించారు. అయితే, మానిటరింగ్ అలారం మోగడంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కర్మాగారంలోని ఒక రియాక్టర్ సోమవారం మధ్యాహ్నం 2:00 గంటలకు తిరిగి ప్రారంభమైనట్లు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టీఈపీసీఓ) ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే నెలలో సమగ్ర తనిఖీ ముగిశాక ఈ ప్లాంట్లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ కర్మాగారంలో మొత్తం ఏడు రియాక్టర్లు ఉన్నాయి.

# హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ కాళహస్తీశ్వరునికి గొడుగులు సమర్పణ

**తిరుపతి,ఫిబ్రవరి 10, మనం న్యూస్ :** దక్షిణ కైలాసంగా ఖ్యాతి గడుస్తున్న శ్రీ కాళహస్తీశ్వర ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి వాహన సేవలకు అలంకరించేందుకు చెన్నై హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ట్రస్టీ ఆర్.ఆర్ గోపాల్ జీ ఆధ్వర్యంలో ఐదు గొడుగులను శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ అధికారులు మరియు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ చేతులు మీదుగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి కానుకగా అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేకంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దర్శనం అనంతరం ఆలయం వెలుపల హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ట్రస్టీ ఆర్. ఆర్ గోపాల్ జీ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి అనుగ్రహంతో గత 15 సంవత్సరాలుగా శ్రీకాళహస్తీశ్వర ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రియ భక్తుడైన భక్త కన్నప్ప కొండపై



కైలాసనాథ స్వామి ధ్వజారోహణం రోజున ఈ గొడుగులను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏ ఈ ఓ మోహన్, విద్యాసాగర్ మరియు శ్రీకాళహస్తీశ్వరాలయం ట్రస్టీ బోర్డు సభ్యులు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సింహ వాహనంపై శ్రీ సోమస్కందమూర్తి

**తిరుపతి, ఫిబ్రవరి 10 మనం న్యూస్ :** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన మంగళవారం రాత్రి శ్రీ సోమస్కందమూర్తి సింహ వాహనంపై అభయమిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. మృగరాజు సింహం. దేవతల్లో అత్యంత ఉత్కృష్టుడు పరమేశ్వరుడు. భక్తుల హృదయం గుహ వంటిది. ఆ గుహలో సింహం వంటి ఈశ్వరుని ఆరాధిస్తూ ఉంచుకుంటే జీవుడు ఏ భయాన్ని పొందడు. మృగరాజు వంటి శివపరమాత్మ కొలువై అభయమిచ్చి జీవనాన్ని పాలిస్తుంటే, అరిషడ్వర్గాలనే క్షుద్రమృగాల భయం ఉండదు. వాహనసేవలో జేఈవో వీరబ్రహ్మం, సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఏపీజేఏసీ ఛైర్మన్‌గా విద్యాసాగర్ ఏకగ్రీవ ఎన్నిక

- పిఆర్సి కమిటీ చైర్మన్ నియామకం వెంటనే జరగాలి
- ఉద్యోగుల డిమాండ్లు బకాయిలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి
- ఉద్యోగులకు నష్టం కలిగించే ఏ నిబంధననూ అంగీకరించం
- 33 సంవత్సరాల సర్వీసు నిబంధన పాతదే... ఉద్యోగులు ఆందోళన చెందొద్దు
- పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించండి

**ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్**



**విజయవాడ, ఫిబ్రవరి 10(మనంన్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించిన హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చినా, ఉద్యోగులకు నష్టం కలిగించే ఏ నిబంధననైనా ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని, 33 సంవత్సరాల సర్వీసు నిబంధన పాతదేనని, ఈ విషయంలో వస్తున్న అవాస్తవ ప్రచారాల గురించి ఉద్యోగులు ఆందోళన చెందనవసరం లేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జెఏసి) చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్లు అన్నారు. ఏపీ జేఏసీ కార్యవర్గ సమావేశం మంగళవారం గాంధీనగర్ లోని ఎన్జీజీవో హోం లో నిర్వహించి.. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంపై కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో ఏపీ జెఏసి చైర్మన్గా శ్రీ ఏ విద్యాసాగర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఏపీ జెఏసి చైర్మన్, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రధానంగా 2023 జూలై నెలలో నియమించాల్సిన వేతన సవరణ కమిటీ (పి.ఆర్.సి.) చైర్మన్ నియామకంలో జాప్యం జరగకుండా బుధవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు కమిటీ నియామకంపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలన్నారు.

33 సంవత్సరాలు సర్వీస్ చేసిన వాళ్లు తప్పనిసరిగా రిటైర్ అవ్వాలని ప్రభుత్వం చెబుతున్న నిబంధన కొత్తది కాదని, గత నాలుగు దశాబ్దాలుగా ఆ నిబంధన అలాగే ఉందని, ఈ అంశంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం ఏ సవరణ చేయాలనుకున్నా ముందు ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించిన తర్వాత వారి అంగీకారంతోనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. 20వ తారీకు లోపు సంఘాల అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వానికి చెప్తామని, వస్తువు కానీ ప్రచారాలను వదంతులను ఉద్యోగులు ఎవరు నమ్మవద్దని ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని తెలిపారు.

ప్రభుత్వం నవంబరులో ఆరు డిమాండ్లపై హామీ ఇవ్వడం జరిగిందని.. వీటిలో అయిదు డిమాండ్లకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడటం జరిగిందన్నారు.

సిపిఎస్ విధానంలో ఉన్న ఉద్యోగులను నిబంధనల ప్రకారం ఓ పి ఎస్ లోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల పాఠశాల ఉద్యోగులకు కూడా 62 సంవత్సరాలకు పదవి విరమణ చేసే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బలహీన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో పెన్షనర్లకు జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దేందుకు ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో కార్యాచరణ ప్రకటించి వారికి న్యాయం చేయాలన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ల విషయంలో జరుగుతున్న నష్టాన్ని పూరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో అన్ని జిల్లాల జేఏసీ శాఖలను పునర్వ్యవస్థీకరిస్తున్నామని అన్ని మండల శాఖ లను పునర్వ్యవస్థీకరిస్తామన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో ఉద్యోగులకు ఉన్న బకాయిలలో కొంతవరకు వరకు సాధించగలిగామన్నారు. ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఉద్యోగుల సహేతుకమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ముందుకు రావాలన్నారు.

ఈనెల 12వ తేదీన వివిధ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుకు సంఘీభావంగా అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వం జోగుల సమాఖ్య పిలుపుమేరకు రాష్ట్రంలోనే జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల నందు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేపడతామని విద్యాసాగర్ తెలిపారు.

ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధి, జేఏసీ సెక్రటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ టీచర్లు 950 మంది వరకు మరణించారని.. వారి కుటుంబాలకు కారుణ్య నియామకంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరోనా సమయంలో శ్రీకాకుళం జిల్లాలో మరణించిన ఒక పంచాయతీరాజ్ టీచర్ కుటుంబానికి ఉపాధి కల్పించడంలో జాప్యాన్ని భరించలేక ఆ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కారుణ్య నియామకాలు భర్తీ చేసేందుకు ప్రతిబంధకాలుగా ఉన్న విధివిధానాలను సరళతరం చేసి 950 కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు లభించాల్సిన వైద్య సేవల అంశంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని ఇందుకు సంబంధించిన కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

సమావేశంలో జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డీవీ రమణ, జేఏసీ నాయకులు ఎం.రఘునాథరెడ్డి (ఎస్టీయూ), జి.హృదయరాజు (ఏపీటీఎఫ్), బి.సాంబశివరావు (పబ్లిక్ సెక్టార్), వై.శ్రీనివాసరావు (ఎన్ఎంయూ), ఎన్.చంద్రశేఖర్ (నాలుగో తరగతి), బండి శ్రీనివాసరావు (పంచాయతీరాజ్ మినిస్టీరియల్), పీవీ సాయికుమార్ (అగ్రికల్చరల్ ఎంప్లాయీస్), పి.మధుకరబాబు (ట్రాన్స్పోర్ట్), బి.జానకి, ఎస్.విద్య, సి.ఎం.దాసు (సీపీఎస్ ఎంప్లాయీస్) జేఏసీ లోని వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఏపీ జెఏసి సెక్రటరీ జనరల్ డివి రమణ, కిలారు జగదీశ్వరరావు, ఎం. రఘునాథరెడ్డి, జి హృదయ రాజు, ఎన్. చంద్రశేఖర్ బండి శ్రీనివాసరావు, పివి సాయికుమార్, ఎస్. రాధమ్మ, బి. నరసింహులు, బి వెంకటేష్ బాబు, బి. జానకి, బి. సేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శివ స్వాములపై లాఠీఛార్జ్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం



- శ్రీశైలం ఘటన సిగ్గుచేటు..
- సీఎం, దేవాదాయ మంత్రి భక్తులకు క్షమాపణ చెప్పాలి
- దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి
- బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం

**తిరుపతి/అమరావతి, ఫిబ్రవరి10 మనం న్యూస్ :** పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో, మల్లన్న దర్శనానికి వచ్చిన శివ స్వాములు, భక్తులపై పోలీసులు జరిపిన అమానుష లాఠీఛార్జ్ను భారతచైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రభుత్వ అహంకారానికి, ఆలయ అధికారుల చేతకానితనానికి పరాకాష్ట అని ఆయన అభివర్ణించారు. దైవ దర్శనానికి వచ్చిన భక్తులను పశువుల కంటే హీనంగా చూడటం, శాంతియుతంగా నిరసన తెలిపిన స్వాములపై లాఠీలు ఝుళిపించడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు.

**అధికారుల వైఫల్యం.. భక్తులపై దాడి**

ఆలయ సిబ్బంది నిర్వహణ లోపం వల్లే ఈ దారుణమైన పరిస్థితి తలెత్తిందని రామచంద్రయాదవ్ స్పష్టం చేశారు. గంటల తరబడి భక్తులను క్యూలైన్లలో నిలబెట్టి, వారి సహనాన్ని పరీక్షించారని, కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. అధికారుల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, దర్శనం కోసం ఆవేదనతో ముందుకు వచ్చిన భక్తులపై విచక్షణారహితంగా దాడి చేయడం ఏ రకమైన పాలన అని ఆయన ప్రశ్నించారు.

**దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి**

భక్తులపై, మాల ధరించిన శివ స్వాములపై లాఠీలతో దాడి చేసిన పోలీసు సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే భయోత్పాతాన్ని సృష్టించడం దారుణమన్నారు. ఈ ఘటనపై కేవలం విచారణతో సరిపెట్టకుండా, బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి**

ఈ సిగ్గుచేటు ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ, ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి తక్షణమే యావత్ హిందూ సమాజానికి, శివ స్వాములకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. దేవాలయాలను ఆదాయ వనరులుగా కాకుండా, భక్తుల విశ్వాసానికి, మనోభావాలకు సంబంధించిన పవిత్ర స్థలాలుగా చూడాలని ప్రభుత్వానికి హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

# భక్తులతో మమేకమైన టీటీడీ చైర్మన్

టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు సేకరణ

శ్రీవారి సేవకులతో కలిసి అన్న ప్రసాదాలను వడ్డించిన చైర్మన్

సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపిన భక్తులు

**తిరుమల, ఫిబ్రవరి 10 మనం న్యూస్ :** టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులతో మమేకమై టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై స్వయంగా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం ఆయన తిరుమలలోని సుదర్శన్ సత్రాన్ని తనిఖీ చేసి గదుల్లో వాటర్ లీకేజిని అరికట్టాలని ఆదేశించారు. ఈ భవనాన్ని ఆధునీకరణ లేదా పునర్నిర్మాణం చేసే విధంగా అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ సత్రం



వద్ద ఉన్న ఫుడ్ కౌంటర్ లో శ్రీవారి సేవకులతో కలిసి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. అన్న ప్రసాదాల రుచి, నాణ్యత గురించి ఏవిధంగా ఉందని అడగ్గా భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి పక్కనే ఉన్న టీ దుకాణంలో టీ సేవించారు.

అంతకుముందు చైర్మన్ తిరుమలలోని కాకులమానుతిప్ప వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఐఓసీఎల్ గ్యాస్ ప్లాంటును తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 5 నెలల ముందు తిరుమలలో ఐఓసీఎల్ ప్లాంటుకు శంకుస్థాపన చేశామని చెప్పారు. మార్చి నెలలో నిర్మాణం పూర్తి చేసి మే నెల నుండి ఈ ప్లాంటు ద్వారా కార్యాకలాపాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ప్లాంటును రోజుకు 40 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా టీటీడీకి సంవత్సరానికి 1.52 కోట్లు ఆదా అవుతుందని, అంతేకాకుండా చెత్తను పునర్వినియోగించడంతో తిరుమల డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు సోమన్నారాయణ, భాస్కర్, వీజీవో సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.1.40 కోట్లు విరాళం

**తిరుమల, ఫిబ్రవరి 10,మనం న్యూస్ :** టీటీడీకి మంగళవారం రూ. 1.40 కోట్ల విరాళాన్ని ముగ్గురు దాతలు అందజేశారు. హైదరాబాద్ కు చెందిన గుత్తా హర్షసాయి చౌదరి మంగళవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించారు. దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు. ఇంకా హైదరాబాద్ కు చెందిన స్మార్ట్ సాఫ్ట్ వేర్ అండ్ మోహన్ ఇండస్ట్రీస్ ఎండీ యలమంచిలి మదన్మోహన్ రావు రూ.30 లక్షలు



విరాళంగా అందించారు. ఈ దాత కూడా శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీని అందజేశారు. ఈ విరాళాన్ని శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు, ఇతర ట్రస్టులకు వినియోగించాలని దాత చైర్మన్ ను కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు. అదేవిధంగా గుంటూరుకు చెందిన ఎన్.సుధారాణి టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.10,01,116 విరాళంగా అందించారు. ఆమె తిరుమలలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

# బడ్జెట్ సమావేశాలను ప్రారంభించిన మేయర్ డాక్టర్ శిరీష

**తిరుపతి, ఫిబ్రవరి 10 మనం న్యూస్ :** తిరుపతి నగరపాలక సంస్థ చివరి ఐదవ బడ్జెట్ సమావేశాలను నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఎస్వీయూ సెనేట్ హాల్ లో ప్రారంభమయ్యాయి.. బడ్జెట్ సమావేశాన్ని మేయర్ డాక్టర్ శిరీష లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరుసగా ఐదవ బడ్జెట్ ప్రవేశ పెట్టే కౌన్సిల్ కి మేయర్ గా ఉండే అవకాశం నాకు లభించినందుకు చాలా సంతోషంగా ఉంది.మీ అందరి సహకారంతోనే నాకు ఈ గౌరవం లభించింది. అందుకు వ్యక్తిగతంగా ప్రత్యేక అభినందనలు. చిన్న ఆశ అయితే ఉన్నింది.. అదే చివరి బడ్జెట్ గ్రేటర్ తిరుపతి నగర బడ్జెట్ గా పెట్టే అవకాశం వస్తుందని. గ్రేటర్ ఆలస్యం అవుతున్నందుకు కొంత అసంతృప్తి ఉన్నా నాకు నమ్మకం ఉన్నది.. తదుపరి ఎన్నికలు మాత్రం గ్రేటర్ తిరుపతి నగర పాలక సంస్థకే జరుగుతుందని. మరో మారు రాష్ట్ర ప్రభుత్వానికి మన కౌన్సిల్ తరపున, తిరుపతి నగర ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను గతంలో కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ తిరుపతికి ఆమోదం తెలపాలని కోరారు. బడ్జెట్ అనేది ఒక నిర్ణీత కాలానికి (సాధారణంగా ఒక సంవత్సరం) రాబోయే ఆదాయ, వ్యయాల యొక్క అంచనా ఆర్థిక ప్రణాళిక. ఇది కుటుంబం, వ్యాపారం లేదా దేశం మరియు మన లాంటి నగరం యొక్క ఆర్థిక వనరులను




సమర్థవంతంగా ఉపయోగించడానికి, అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవడానికి మరియు పొదుపును పెంచుకోవడానికి సహాయపడే ఒక నివేదిక. వీలైనంత వరకు మన బడ్జెట్ ను సమతుల్యత బడ్జెట్ గా రూపొందించుకుంటే బాగుంటుంది. అంటే ఆదాయ వ్యయాల సమతుల్యత అని అర్థం. బడ్జెట్ రూపకల్పనలో సమతుల్యత లోపిస్తే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు.

మనం ఆమోదించబోయే బడ్జెట్ తిరుపతి నగర భవిష్యత్తుకి ఉపయోగపడే విధంగా ఉండాలి.. మన బడ్జెట్ ప్రతిపాదనలు, మన చర్చలను పరిశీలించిన తిరుపతి నగర ప్రజలకు తాము చెల్లిస్తున్న ప్రతి రూపాయిని మేము ఎన్నుకున్న మా ప్రతినిధులు చాలా జాగ్రత్తగా , బాధ్యతగా ఖర్చు పెడుతున్నారు.. మా గురించే.. మా ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకున్నారని భావించాలి. ఎందుకంటే మనం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజల పన్నుల ద్వారానే అన్న విషయం మరిచిపోకూడదు. అందుకే బడ్జెట్ చర్చలో పాల్గొనే నాతో సహా ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా ఉండాలి. తిరుపతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం కాబట్టి భవిష్యత్తు నగర అభివృద్ధి అవసరమైన మౌలిక వసతుల కోసం మన ఆలోచనలు ఉండాలి. గత బడ్జెట్ ప్రతిపాదనలు , ఖర్చు చేసిన విధానం పై హేతుబద్ధమైన చర్చ చేద్దాం బడ్జెట్ లో కీలకమైన అంశం ఆదాయం.. ఆదాయ వ్యయాలపై ప్రతి సభ్యులు స్పష్టంగా మాట్లాడాలి. ఏ నగరానికి లేని అవకాశం మన తిరుపతి నగరానికి ఉన్నది.. శ్రీవారి పాదాల చెంత నెలకొన్న నగరం కాబట్టి టిటిడి, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టుకోవాలి. అంచనాలకు అనుగుణంగా రాబడి ఉంటేనే అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేమన్నారు.

ఆదాయం ఎంత ముఖ్యమో ప్రజల పై అదనపు భారం పడకుండా వనరుల సాధన కోసం అన్వేషణ చేయాలన్నారు. ఈ సమావేశాలలో నగర కమిషనర్ మౌర్య గారు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం గారు ఎమ్మెల్యే శ్రీనివాసులు గారు.. కార్పొరేటర్లు , అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్వీ ఆయుర్వేద కళాశాలను అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లాలి

- టిటిడి జేఈవో (వైద్య, విద్య) డా. ఎ. శరత్

**తిరుపతి, ఫిబ్రవరి 10,మనం న్యూస్ :** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలను దేశంలోనే అత్యుత్తమ కళాశాలగా తీర్చిదిద్దాలని టిటిడి జేఈవో (వైద్య, విద్య) డా. ఎ. శరత్ తెలిపారు. మంగళవారం ఆయన ఎస్వీ ఆయుర్వేద కళాశాల మరియు అనుబంధ వైద్యశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, కళాశాల మరియు వైద్యశాలలో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రాచీన ఆయుర్వేదంలోని విశిష్టతను నేటి తరానికి చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేద వైద్యులు ప్రణాళికాబద్ధంగా పరిశోధనలు చేపట్టి మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కళాశాలలోని సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థుల సమస్యలు, కళాశాల మౌలిక సదుపాయాలు, సిబ్బంది, భద్రత వంటి అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు ఆయుర్వేదంలో నూతన పరిశోధనలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు.



అంతకుముందు ఆయన విద్యార్థులతో ముచ్చటించి, వారి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బోధనా సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన భవనాల నిర్మాణానికి సంబంధించి ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. రేణు దీక్షిత్ కళాశాల పురోగతి, వైద్యశాలలో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలను జేఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈ సుమతి, కళాశాల బోధనా సిబ్బంది మరియు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ష్.... ష్...!

నిన్న రాత్రి నుండి
మా పురవీధులన్నీ
మౌన ముద్రధారులైనాయి
నగర సేవకు నడుము కట్టిన నేతలకు
కంటికి నిద్ర కరువైంది!
ఎవరో ఒకరు అర్ధరాత్రి
తలుపు తట్టకపోరని
ద్వారా బంధాలన్నీ నిద్ర నటిస్తున్నాయి
తమ ఓటు బంగారానికి ఎవరో
విలువ కడతారని ఎదురు చూస్తున్నాయి
స్థానిక ఎన్నికల్లో
ప్రజాస్వామ్యం ఎప్పటికీ ఓ వేలం పాటనే!
ఇంతమంది ప్రజాసేవకులున్న దేశంలో
ప్రజల ప్రశాంత జీవనాన్ని
ఎవరు ఎత్తుకెళ్లారో!

అందరిదీ ఇప్పుడు ఎలుగుబంటి నిద్రనే!
ఎంత నిలదీసినా కారణాలెవరూ చెప్పరు
కొంపలు కూల్చేసి నింపాదిగా
కిందొక చెరువుండేదని సినిమా చూపిస్తారు!
జీవితమంతా ఎగబాకి ఎగబాకి
చీమలు పెట్టుకున్న చిన్న చిన్న పుట్టలు
ఒక్కసారిగా చిధ్రమైయిపోతాయి
దిక్కుతోచని దుఃఖ తీరాలను
బహుళ అంతస్తుల మేడలు వెక్కిరిస్తాయి
వాటి జోలికి ఎవ్వరూ పోరు
నిన్న ఓట్లు అడిగిన చేతులే
పగబట్టిన శత్రు కూటాలైతవి
ప్రతి పనికి రుసుము నిర్ణయించి
టోల్ గేట్ ఫీజుల్లా ఐదేళ్లు వసూలు చేస్తాయి
అలవాటు పడిన మనుషులు
వంతెన కింది ప్రవాహాలుగా మారిపోతారు!
మనం ఎంతో మొత్తుకున్నా
ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి చావు లేదు
ప్రశ్నలకెన్నటికి తావు లేదు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# పోలింగ్ రోజు వ్యూహాల యుద్ధం

నేడు మున్సిపల్ పోలింగ్ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు మరొకసారి ఉత్కంఠ భరిత దశలోకి ప్రవేశించాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా పట్టణ పాలనకు సంబంధించినవిగా కనిపించినా, వాస్తవానికి ఇవి రాష్ట్ర స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపే కీలక సమరాలుగా మారాయి. మున్సిపల్ ఎన్నికలు ప్రజల దైనందిన జీవితాలకు అత్యంత సమీపంగా ఉండే పరిపాలనా వ్యవస్థకు ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ కావడంతో, ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ రోజున పోల్ మేనేజ్‌మెంట్, వనరుల వినియోగం, ఓటర్ల మొగ్గును ప్రభావితం చేసే వ్యూహాలు అన్నీ ఒకేసారి కేంద్రీకృతమై కనిపిస్తాయి.

మున్సిపల్ ఎన్నికల పూర్వాపరాలను పరిశీలిస్తే, పట్టణీకరణ వేగవంతమైన కొద్దీ స్థానిక సంస్థల ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. జనాభా పెరుగుదల, పట్టణ సేవలపై ఒత్తిడి, మౌలిక వసతుల విస్తరణ అవసరం వంటి అంశాలు మున్సిపల్ పాలనను రాజకీయంగా కీలకంగా మార్చాయి. గత రెండు దశాబ్దాల్లో పట్టణ జనాభా శాతం నిరంతరం పెరుగుతూ రావడం వల్ల, మున్సిపల్ సంస్థలు కేవలం చెత్త సేకరణ లేదా రహదారుల మరమ్మతులకే పరిమితం కాకుండా, పట్టణాభివృద్ధి, పన్నుల సేకరణ, పౌర సేవల డిజిటలైజేషన్ వంటి విస్తృత బాధ్యతలను చేపట్టాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పట్టణ ఓటర్ల రాజకీయ దృక్పథాన్ని ప్రతిబింబించే సూచికలుగా మారాయి.

పోలింగ్ రోజున ప్రధానంగా చర్చకు వచ్చే అంశం పోల్ మేనేజ్‌మెంట్. ఇది కేవలం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే కాదు. బూత్ స్థాయి వ్యూహాల సమన్వయం, కార్యకర్తల నియోజకవర్గ వారీ చురుకుదనం, ఓటర్ల జాబితాల పరిశీలన, చివరి నిమిషం సంప్రదింపులు వంటి అనేక అంశాల సమ్మిళితం. ప్రతి ప్రధాన పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, ఓటర్ల సామాజిక, ఆర్థిక నేపథ్యాలను విశ్లేషిస్తూ మైక్రో స్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తుంది. పోలింగ్ రోజున ఉదయం నుంచే ఓటింగ్ శాతం ఎలా పెరుగుతోంది, ఏ వార్డుల్లో ఓటింగ్ మందగిస్తోంది వంటి వివరాలను సమయానుకూలంగా విశ్లేషిస్తూ వ్యూహాలను మార్చడం ఆధునిక పోల్‌మేనేజ్‌మెంట్‌లో కీలకంగా మారింది.

ప్రధాన పార్టీల పోరు ఈ ఎన్నికల్లో బహుముఖంగా కనిపిస్తుంది. అధికార పార్టీ తన పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన అజెండాగా ప్రస్తావిస్తూ పట్టణ ఓటర్ల విశ్వాసాన్ని నిలబెట్టు కునేందుకు ప్రయత్నిస్తుంది. ప్రతిపక్షాలు మాత్రం స్థానిక సమస్యలు, పన్నుల భారం, మౌలిక వసతుల లోపాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ వ్యతిరేకతను సమీకరించేందుకు కృషి చేస్తాయి. మున్సిపల్ ఎన్నికల ప్రత్యేకత




ఏమిటంటే, ఇక్కడ అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిచయాలు, సామాజిక వలయాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల పార్టీ చిహ్నం ఎంత ముఖ్యమో, అభ్యర్థి స్థానిక ప్రాతినిధ్యం కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించు కుంటుంది.

ఓట్లను అనుకూలంగా మలచు కోవడానికి ఎత్తుకు పై ఎత్తులు వేయడం ఎన్నికల రాజకీయాల్లో కొత్త విషయం కాదు. అయితే ఇటీవలి కాలంలో ఈ వ్యూహాలు మరింత వ్యవస్థీకృత రూపం దాల్చాయి. డేటా ఆధారిత ప్రచారం, ఓటర్ల విభజన, లక్ష్యిత కమ్యూనికేషన్ వంటి పద్ధతులు పట్టణ ఎన్నికల్లో విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, స్థానిక ప్రభావశీలుల ద్వారా సందేశాల వ్యాప్తి వంటి మార్గాలు పోలింగ్ రోజుకూడా చురుకుగా కొనసాగుతాయి. చివరి నిమిషం వరకు ఓటర్లను ప్రభావితం చేయాలనే ప్రయత్నం ప్రతి పార్టీలోనూ స్పష్టంగా కనిపిస్తుంది.

వనరుల వినియోగం కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలక అంశం. మానవ వనరులు, ప్రచార సామగ్రి, రవాణా సౌకర్యాలు, డిజిటల్ కమ్యూనికేషన్-కలిసి ఒక సమగ్ర ఎన్నికల యంత్రాంగాన్ని నిర్మిస్తాయి. బూత్ స్థాయిలో కార్యకర్తల మోహరింపు, ఓటర్ల రాకపోకలకు సహకారం, ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించే సమన్వయం- ఇవి పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగం. ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు అమలు చేస్తున్న నేపథ్యంలో, ప్రతి పార్టీ తన వ్యూహాలను చట్టబద్ధ పరిధిలోనే అమలు చేయాల్సిన అవసరం పెరిగింది.

గణాంకాల పరంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం సాధారణంగా రాష్ట్ర లేదా జాతీయ ఎన్నికలతో పోలిస్తే కొద్దిగా తక్కువగా ఉండే ధోరణి కనిపించినా, పట్టణాల్లో స్థానిక సమస్యలు ముదిరినప్పుడు ఓటర్ల చురుకుదనం పెరుగుతుంది. మహిళలు, యువత, మధ్యతరగతి ఓటర్ల భాగస్వామ్యం పెరగడం పట్టణ ఎన్నికలలో ఒక ముఖ్య లక్షణంగా మారింది. స్వయం సహాయక సంఘాలు, కాలనీ సంఘాలు, వృత్తి వర్గాల సమీకరణ కూడా ఓటింగ్ సరళిపై ప్రభావం చూపుతుంది. ప్రధాన పార్టీల అవకాశాలను విశ్లేషించినప్పుడు స్థానిక రాజకీయ సమీకరణలు కీలకంగా మారతాయి. అధికార పార్టీకి పాలనా ప్రయోజనం, అమలు చేసిన సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం కొంత మేర అనుకూల వాతావరణాన్ని కల్పించవచ్చు. అయితే స్థానిక అసంతృప్తి, అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి, వర్గపోరు వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రతిపక్షాలకు ప్రజా అసంతృప్తిని సమీకరించే అవకాశం ఉన్నప్పటికీ, బలమైన స్థానిక నాయకత్వం లేకపోతే అది ఓట్లుగా మారడం సవాలుగా మారుతుంది. చిన్న పార్టీలూ, స్వతంత్ర అభ్యర్థులూ కొన్ని వార్డుల్లో కింగ్‌మేకర్ పాత్ర పోషించే పరిస్థితులు కూడా ఉత్పన్నమవుతాయి.

పోలింగ్ రోజున పరిపాలనా యంత్రాంగం పాత్ర అత్యంత కీలకం. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, మైక్రో అబ్జర్వర్లు వంటి చర్యలు అమల్లో ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలింగ్ ప్రక్రియ పారదర్శకత పెరిగింది. ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు, సౌకర్యాల కల్పన వంటివాటిని పెంచేందుకు దోహద పడుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికల విస్తృత ప్రభావాన్ని పరిశీలిస్తే, ఇవి భవిష్యత్తు రాజకీయ ధోరణులకు సూచికలుగా నిలుస్తాయి. పట్టణ ఓటర్ల అభిరుచులు రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పార్టీలకు ఇది తమ బలాబలాలను అంచనా వేసుకునే అవకాశం కాగా, ప్రజలకు స్థానిక పాలనపై తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచే వేదిక. పోలింగ్ శాతం, వార్డు వారీ ఫలితాలు, ఓట్ల మార్జిన్లు- ఇవి భవిష్యత్తు వ్యూహాల రూపకల్పనకు ఆధారాలుగా మారతాయి.

నేటి మున్సిపల్ పోలింగ్ పట్టణ ప్రజాస్వామ్యానికి ఒక పరీక్ష. ప్రధాన పార్టీల వ్యూహాలు, పోల్ మేనేజ్‌మెంట్ సామర్థ్యం, ఓటర్ల చైతన్యం-కలిసి ఈ ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయి. స్థానిక సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలు ముందుకు రావడం ద్వారా మున్సిపల్ వ్యవస్థ బలోపేతం అవుతుంది.

మున్సిపల్ ఎన్నికలు స్థానిక సమస్యలు, అభివృద్ధి పనితీరు, అభ్యర్థుల వ్యక్తిత్వం, పార్టీ వ్యూహాలు, సామాజిక సమీకరణాలు- ఈ అన్నింటి సమ్మేళనం. ప్రధాన పార్టీల అవకాశాలు ఈ అంశాలను ఎంత సమర్థంగా సమన్వయం చేసుకుంటాయన్నదానిపై ఆధారపడి ఉంటాయి. ఫలితాలు ఏవైనా కావొచ్చు. ప్రజల తీర్పు స్థానిక పాలనకు దిశానిర్దేశం చేస్తూ, భవిష్యత్ అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ధారిస్తుంది. ఇదే మున్సిపల్ ఎన్నికల అసలైన ప్రజాస్వామ్య సారాంశం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494


# ఏకాత్మతావాద సిద్ధాంత కర్త దీన్ దయాళ్

కొందరు మరణించేవరకు జీవిస్తారు, కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారు. రెండవ కోవకు చెందిన వారు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ. అతి సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య వ్యక్తిగా ఎదిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తర ప్రదేశ్ లోని మధుర దగ్గర 'నగ్ల చంద్రభాన్' అనే గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి, తండ్రి మరణించిన దీనదయాళ్ మేనమామ ఇంటిలో పెరిగారు. 1925 ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టిన దయాళ్ కాన్పూర్‌లో బి.ఎ చదువుతున్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్‌తో పరి చయం ఏర్పడింది. 1937లో మొదటి కొద్దిమంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారు. అప్పటి నుండి ఆయన జీవిత విధానం, గమ్యం మారిపోయింది. సంఘ్‌లో పనిచేస్తూనే బి.ఎడిగ్రీ, ఉపా ధ్యాయ శిక్షణ పూర్తిచేశారు. సంఘ్ విస్తరణకు పూర్తి సమయం ఇచ్చేందుకు పై చదువులకు స్వస్తి పలికారు. ఉత్తర ప్రదేశ్‌లోని లఖంపూర్ ప్రాంతానికి ప్రచారకులుగా నియుక్తులైన కొద్ది సంవత్సరాల లోనే ఆ ప్రాంతంలో సంఘ్ కార్యక్రమాలను వికసింప జేశారు. అది గమనించిన సంఘ్ పెద్దలు వారిని ఉత్తర ప్రదేశ్ ప్రాంత సహ ప్రచారకులుగా నియమించారు. ఆయన అసామాన్యమైన ప్రతిభా పాటవాలు అందరినీ ఆకట్టు కున్నాయి. సంఘ్ కార్యక్రమాలు చూస్తూనే పత్రికారంగంపై దృష్టి సారించి రాష్ట్ర ధర్మ ప్రకాశన్ అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఆ ప్రకాశన్ ద్వారా 'రాష్ట్ర ధర్మ', అనే ఒక మాస పత్రిక, 'పాంచజన్య' అనే వార పత్రిక, 'స్వదేశ్' అనే దిన పత్రిక ప్రారంభించారు. ఆ పత్రికలు దీనదయాళ్ కార్యదీక్షకు ప్రతీకలుగా నిలిచాయి. 1952లో భారతీయ జనసంఘ్‌లో చేరి ఉపాధ్యక్షులుగా నియమితుడైనారు. 1967లో జనసంఘ్ అధ్యక్ష పదవి చేపట్టే వరకు ఆ పదవిలో కొనసాగారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మరణించాక, పార్టీ బాధ్యతలు భుజాన వేసుకొని విజయపథంలో నడిపించారు. అలాగే ఆర్.ఎస్.ఎస్ వారపత్రిక పాంచజన్య, లక్నో దినపత్రిక 'స్వదేశ్'లకు సంపాద కులుగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతానికి పునాదిగా చెప్పబడే ఏకాత్మతా మానవతా వాదం, శంకరాచార్య జీవిత చరిత్ర వంటి పుస్తకాలు, హిందీలో 'చంద్రగుప్తమౌర్య' నాటకం, మరాఠీ నుండి ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులు డా.హెడ్గేవార్ జీవిత చరిత్ర అనువాదం వంటి పలు రచనలు చేశారు. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు ఉన్నాయని వివ రించే క్రమంలో 'ఏకాత్మతా మానవతా వాదం' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిం చారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహికసుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదిం చారు. గాంధీజీని కాల్చిచంపిన నేరాన్ని హిందూ మహాసభతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ పై కూడా మోపిన నేపథ్యంలో, ఆనాటి ప్రధాని నెహ్రూజీ సంఘ్‌ను నిషేధిం చారు. ఆ నిషేధాన్ని తొలగించాలంటూ జరిగిన ఉద్యమానికి ఉత్తర ప్రదేశ్‌లో దీనదయాళ్ నిర్వహించిన పాత్ర గణనీయమైంది. ఈ హత్యానేరంలో సంఘ్ పాత్ర లేదని దీనదయాళ్ పాంచజన్యలో స్పష్టం చేస్తూ ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా రాసిన రాతలకు ఆనాటి ప్రభుత్వం పాంచజన్యను నిషేధించింది. దానికి బదులుగా 'హిమాలయ'అనే మరో వారపత్రికను ప్రారం భించి తన కలంతో నాటి ప్రభుత్వానికి కలవరం పుట్టించారు. ఈలోగా గాంధీజీ హత్యా నేరంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర లేదని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జాతి, జాతీయత, భారతీయ సంస్కృతి, ధర్మం మొదలైన విషయాలపై ఆయనలోని అభిప్రాయాలు, మౌలిక సిద్ధాంతాలు తదితరాలపై ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలు, భారతీయ తత్వజ్ఞాన సారాన్ని దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి సామ్రాట్, చంద్రగుప్త, జగద్గురు శంకరాచార్య అనే చారిత్రక నవలలను కూడా దీన దయాళ్ రాశారు. 1951లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రధాని నెహ్రూ విధానాలకు నిరసనగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి వచ్చారు. ఆనాడు దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి నెహ్రూ అనుసరిస్తున్న, ముస్లిం సంతుష్టీకరణ, హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడానికి, భారతీయ సంస్కృతి సభ్యులతో, జాతీయ భావాలతో కూడుకున్న రాజకీయ పార్టీని స్థాపించాలనే ఉద్దేశంతో ఆనాటి ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ గురూజీ సహాయాన్ని అర్థించారు. ఆయన కోరిక మేరకు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి, జగన్నాథరావు, సుందర్ సింగ్ భాండారి లాంటి మరి కొందరు యువకులను అప్పగించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబరు 21న ఏర్పాటు చేసిన జనసంఘ్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా దీనదయాళ్ ఎన్నికైనారు. పార్టీ స్థాపించిన మూడు మాసాలకే 1952లో జరిగిన జనరల్ ఎన్నికలలో పోటీ చేసిన నాలుగు జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటిగా జనసంఘ్ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందింది. తన ఉనికిని సాధారణ ఎన్నికలలో రుజువు చేసుకో గలిగింది. దీనికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నాయకత్వంతో పాటు దీనదయాళ్ సమన్వయ కౌశలం కూడా తోడైంది. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మరణం తర్వాత జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ పార్టీని దేశ వ్యాప్తంగా పటిష్ఠపరచిన ఘనత దీనదయాళ్‌కీ ఆయన సహచరులకు దక్కుతుంది. మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని వాదించాడు.

భారతీయ జనసంఘ్ అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం పనిచేసిన దీనదయాళ్జీ కార్యకర్తల హృద యాలను మలిచి వారి మనస్సులలో అతి స్థిర స్థానాన్ని చూర గొన్నారు. సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవి చూస్తూ దేశసేవ నిమగ్నమై దానినే జీవన కార్యంగా స్వీకరించాడు. జనసంఘ్ లో చేరినప్పటి నుంచి మహారథియై పార్టీకి సారథ్యం వహించి, దేశ రాజకీయాలలో జన సంఘ్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంలో కృత కృత్యులై 1967లో పార్టీ అఖిల భారత అధ్య క్షుడు కాగలిగారు. కాలికట్‌లో జరిగిన అఖిల భారత జనసంఘ్ మహా సభలో భారత దర్శనాన్ని ప్రదర్శింపచేసి విశేష కీర్తి నార్జించారు. ఆ కీర్తియే జనసంఘ్ సిద్ధాంత వ్యతి రేకుల కినుకకు కారణమైంది. రాజకీయాలకు చిత్త శుద్ధి గల నేత బలి అయినారు. ఉత్తర ప్రదేశ్‌లోని మొగల్ సరాయి రైల్వే స్టేషన్‌లో 1968 ఫిబ్రవరి 11న రైలు పట్టాల వద్ద శవమై కనిపించారు.



డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం మాదిరిగానే దీనదయాళ్ మరణం కూడా పలు అనుమానాలకు దారితీసింది.

**ఫిబ్రవరి 11... దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి**

**- ఆర్‌కేఎస్**

# ఇరవై ఏండ్ల 'ఉపాధి' పురోగతి ఎటు?



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGN-REGA)ప్రస్తుతం వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్‌అజీవిక మిషన్ (గ్రామీణ)చట్టం ఫిబ్రవరి 2,2026 నాటికి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ చట్టం యొక్క పురోగతిని మనం చూసినప్పుడు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (MGN-REGA) 2005లో అమలులోకి వచ్చినా ఫిబ్రవరి 2, 2006 నుండి హక్కుల ఆధారిత సామాజిక భద్రతా కార్యక్రమంగా అమలు చేయబడింది. నైపుణ్యం లేని చేతి పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు సాగే వయోజన సభ్యులందరికీ ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధిని హామీ ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి భద్రతను పెంచడానికి ఇది ఏర్పడింది. దీని ప్రధాన లక్ష్యాలు గ్రామీణ పేదరికాన్ని తగ్గించడం, ఉపాధిని సృష్టించడం, కష్టాల వలసలను అరికట్టడం, సమాజ ఆస్తులను సృష్టించడం, పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా వికేంద్రీకృత ప్రణాళికను బలోపేతం చేయడంతోపాటు, మహిళలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమ్మిళితవృద్ధి కి కృషిచేయడం. ఈ కార్యక్రమ పనులు నీటి సంరక్షణ, కరువు నివారణ, భూ అభివృద్ధి, వరద నియంత్రణ, గ్రామీణ అనుసంధానంపై దృష్టి సారించాయి. 2006లో 200 వెనుకబడిన జిల్లాల్లో అమలు ప్రారంభమై, 2007లో 330 జిల్లాలకు విస్తరించి, 2008 నాటికి భారతదేశంలోని అన్ని గ్రామీణ జిల్లాలలో అమలు చేయబడింది. నేడు, ఇది పట్టణ ప్రాంతాలు మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమలు చేయబడింది. ఈ కార్యక్రమం డిమాండ్- ఆధారితమైనది. పని అందించకపోతే నిరుద్యోగ భృతికి చట్టపరమైన నిబంధనలు ఉన్నాయి. సామాజిక తనిఖీలు, బహిరంగ బహిర్గతం ద్వారా పారదర్శకత నిర్ధారించబడుతుంది.

ఈ కార్యక్రమం భారతదేశంలో గ్రామీణాభివృద్ధి, సామాజిక భద్రతను ప్రోత్సహించడంలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. హామీ ఇవ్వబడిన వేతన ఉపాధితోపాటు, గ్రామీణ పేదరికం, నిరుద్యోగాన్ని, గ్రామాల నుండి నగరాలకు వలసలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ పథకం పేద గ్రామీణ కుటుంబాల ఆదాయ భద్రత, కొనుగోలు శక్తిని మెరుగుపరిచింది. కనీసం మూడింట ఒక వంతు భాగస్వామ్యం సమాన వేతనాలను నిర్ధారించడం ద్వారా మహిళలకు సాధికారత కల్పించింది. పంచాయతీ రాజ్ సంస్థల ప్రమేయం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసింది. చెరువులు, రోడ్లు, నీటిపారుదల సౌకర్యాలు వంటి మన్నికైన ఆస్తుల సృష్టి దీర్ఘకాలిక గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతుంది. అయితే ఈ కార్యక్రమం గణనీయమైన సవాళ్లను చూస్తే వేతన చెల్లింపుల్లో జాప్యం, తగినంత నిధులు లేకపోవడం, అవినీతి, నకిలీ జాబ్ కార్డులు, లీకేజీల సమస్యలు, సాంకేతిక ప్రణాళిక, లబ్ధిదారులలో అవగాహన లేకపోవడం మొదలైనవి ఉన్నాయి.ఈ కార్యక్రమం పనితీరు మిశ్రమంగా ఉంది. పూర్తి విజయం లేదా పూర్తి వైఫల్యం అని నిర్ణయించ లేము.

కేంద్రం గత ఎనిమిది సంవత్సరాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై సుమారు 5 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు నివేదించింది. ఇటీవలి సంవత్సరాలలో, వార్షిక కేంద్ర కేటాయింపులు దాదాపు85,000-86,000 కోట్లుగా ఉన్నాయి. రాష్ట్రాలుఈ నిధులను ఉపాధి కోసం ఉపయోగిస్తున్నందున ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం పదివేల కోట్లకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, రాజస్థాన్, తమిళనాడు ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలు మెరుగైన పనితీరు, సకాలంలో వేతన చెల్లింపులు



నిధులను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ముందున్నాయి. దీనికి కారణం బలమైన ప్రణాళిక, పరిపాలనా సామర్థ్యాలు. బీహార్, ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర, కొన్ని ఈశాన్య రాష్ట్రాలు బలహీన మైన అమలుతో ఉన్నాయి. తెలంగాణ ఇటీవల ప్రతి ఇంటికి అత్యల్పసగటు పనిదినాలలో ఒకటిగా నమోదు చేసింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఖర్చు పెద్దది లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్నప్పటికీ, అమలు నాణ్యత ఇప్పటికీ భారత రాష్ట్రాలలో గణనీయంగా మారుతూ ఉంటుంది.

వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ)VB&GRAMGచట్టం. జనవరి 29, 2026న ప్రవేశ పెట్టబడిన ఆర్థిక సర్వే 2025-26, 20 ఏళ్ల జాతీయగ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ) 2025(VB&GRAMG) ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. నిర్మాణాత్మక లోపాలను పరిష్కరించాల్సిన అవసరం, బలమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పేర్కొంటూ శ్రమతో కూడిన నమూనా నుండి మౌలిక సదుపాయాలు, ఆస్తి సృష్టి సామ ర్థ్యంపై కూడా దృష్టి సారించే నమూనాకు మారడం లక్ష్యంగా పెట్టుకుంది. మహాత్మాజాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సాంప్రదాయ పనులకు డిమాండ్ తగ్గడానికి దారితీసిం దని, దీని వలన 'శాసనబద్ధమైన పునఃస్థాపన' అవసరమని ప్రభుత్వం వాదిస్తుంది. ఈ చర్యను ప్రతిపక్ష పార్టీలు 'పనిచేసేహక్కు'ను నీరుగార్చడం మరియు సామాజిక రక్షణలో తగ్గింపు అని విమర్శించారు.2025-26 కేంద్ర బడ్జెట్ గ్రామీణ ఉపాధి కార్యక్రమానికి86,000 కోట్లు (860 బిలియన్ రూపాయలు) కేటాయించింది. నవంబర్26, 2025 నాటికి, కేంద్రం ఈ పథకం కోసం రాష్ట్రాలకు 68,393 కోట్లకు పైగావిడుదల చేసింది. 2023-24తో పోలిస్తే 2025-26లో25.6%తగ్గుదల కనిపించింది. లిబ్టెక్ ఇండియా (నవంబర్ 2025 నాటికి) నిర్వహించిన ద్వివార్షిక ట్రాకర్ ప్రకారం, సర్వే చేయబడిన 20 రాష్ట్రాలలో, ఉత్తరాఖండ్ తెలంగాణతో సహా 11 రాష్ట్రాలు ఉపాధిలో తగ్గుదలని నివేదించాయి. జనవరి 2026 చివరి నాటికి, అధికారిక వెబ్‌సైట్ 2025-26కి 12.18కోట్ల యాక్టివ్ వర్కర్లను నమోదు చేసింది. 2025-26 సంవత్సరానికి ఉపాధి కార్య క్రమానికి వేతన రేట్లలో 2.33% నుండి 7.48% వరకు పెంపును ప్రభుత్వం ప్రకటించింది. 2025 చివరి నుండి ఆధార్ ఆధారిత ఈ-కెవైసి తప్పనిసరి అమలు ఒక ప్రధాన అవరోధంగా గుర్తించబడింది. సాంకేతిక సమస్యలు మరియు డేటా అసమతుల్యత కారణంగా అక్టోబర్ -నవంబర్ 2025 మధ్య 27 లక్షలకు పైగా కార్మికులను తొలగించారు. ఈ-కెవైసి కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే 21 లక్షలకు పైగా క్రియాశీల కార్మికులు పనిని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కేంద్రం 2025-26 ఆర్థికసంవత్సరానికి జమ్మూ కాశ్మీర్‌కు పని పరిమితిని 150 రోజులకు పెంచింది. ఇటీవలి చట్టం (VB&GRAMG చట్టం, 2025) 125 రోజులకు పెంచాలని ప్రతిపాదిస్తున్నది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడిన రోజ్‌గార్ అజీవిక మిషన్-గ్రామీణ్ (VB&GRAMG) కు రూ.95,692 కోట్లు కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్లో ఇది ఏకైక అతిపెద్ద కేటాయింపుగా నిలిచింది. విస్తృత వికసిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా స్వావలంబన గ్రామాలను పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది. దీని కింద కేంద్రం పథకం ఖర్చులో 60% నిధులు సమ కూరుస్తుంది, రాష్ట్రాలు మిగిలిన 40% (ఈశాన్య మరియు హిమాలయ రాష్ట్రాలకు ప్రత్యేక నిబంధనలతో) పంచుకుంటాయి. 2026 బడ్జెట్‌లో GRAMG యొక్క ప్రాధాన్యత గ్రామీణ ఉపాధి, పేదరిక నిర్మూలన, సమాజ ఆస్తుల సృష్టిపై విధాన ప్రాధాన్యతను తెలియజేస్తున్నది. గత 20 సంవత్సరాలుగా, భారతదేశంలో గ్రామీణ స్థితి స్థాపకతపై మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రభావం కాదనలేనిది. వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ) యొక్క ఔచిత్యాన్ని కొనసాగించడానికి పారదర్శకత, సకాలంలో చెల్లింపులు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో ఏకీభవించడం చాలా కీలకం.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించండి

## మంత్రి అచ్చన్నకు పొత్తూరి వినతి



**నరసాపురం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** నరసాపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీకి తగినన్ని నిధులు కేటాయించాలని, రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరిచేందుకు తగన చర్యలు తీసు కోవాలని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరుతూ మంగళవారం మంత్రి అచ్చెన్నాయుడును క్యాంపు కార్యాలయంలో అయినను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలను రామరాజు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు ఉపయోగకరంగా ఉండే పుంత రోడ్లు, లింకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని, రైతు లకు మార్కెటింగ్ సౌకర్యాల మెరుగుదల, పశుసంవర్ధక రంగ అభివృద్ధి, పాడి పరిశ్రమల బలోపేతం, అర్బన్ బ్యాంకుకు నూతన కమిటీ నియామకం, గ్రామీణ ప్రాంతాల లో మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై పొత్తూరి రామరాజు మంత్రి అచ్చెన్నాయుడుతో విస్తృతంగా చర్చించారు. ఐదు సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

# జనసేన ముసుగులో పేదల ఇల్లు, దేవాలయాలు, కూల్చేందుకు కుట్ర

- రాష్ట్రంలో పేద ప్రజల్లో అలజడి సృష్టించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే యోజన
- అధికారులను, పేద ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నవైనం



**పాలకొల్లు, ఫిబ్రవరి 10,మనం ప్రతినిధి:** జనసేన పార్టీ ముసుగులో కొందరు వ్యక్తులు ఏపీ రాష్ట్రంలో పేద ప్రజలు, హిందూ సామాజిక వర్గం, ఇతర సమాజక వర్గంల మధ్య అలజడి, అల్లర్లు సృష్టించడానికి కొందరు వ్యక్తులు కుట్రకు తెర తీసినట్లు తెలుస్తోంది. కొందరు వ్యక్తులు జనసేన పార్టీకి చెందినవారము అని చెప్పుకుంటూ సమాచార హక్కు చట్టం ను, సుప్రీంకోర్టు చట్టాలను అడ్డంగా పెట్టుకుని పేద ప్రజల్ని టార్గెట్ గా చేసుకుని రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఏపీ రాష్ట్రంలో ధనవంతులు పట్టణాల్లోనూ, గ్రామాల్లోను సొంత స్థలాల్లో సొంత ఇల్లు కట్టుకుని జీవిస్తుంటారు. అదే సొంత స్థలం కొనుక్కునే ఆర్థిక స్తోమత లేని అతిపేద వర్గానికి చెందిన అన్ని సామాజిక వర్గాల ప్రజలు లక్షలాదిమంది ప్రజలు ప్రస్తుతం ఏపీ రాష్ట్రంలో శతాబ్దాలు, దశాబ్దాల తరబడి నుంచి ప్రభుత్వానికి చెందిన ట్యాంకు పోరంబోకు చెరువులు గట్లు మీద గృహాలు నిర్వహించుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో పలుకుబడి కల్గిన వారు పట్టాలు తెచ్చుకోగా కొందరికి లేవు. పట్టాలు తెచ్చు కోలేని ఇలాంటి పేద ప్రజలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుని సుప్రీంకోర్టు చట్టాలు, సమాచారం చట్టం అడ్డం పెట్టుకుని జనసేన పార్టీకి చెందిన వ్యక్తులుము అని చెప్పుకొని పట్టణ, పంచాయతీలలో పేద ప్రజల ఇల్లు తొలగించాలని అధికారులు ను డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వెళ్ళు వెత్తుతున్నాయి. ఈ చట్టాలను అమలు చేయలేని అధికారులను వారి గతం లో స్కాములు బయట పెడతామని చెప్పి బెదిరించి వారిని ముప్పు తిప్పలు పెట్టడంతో వారంతా పేద ప్రజలను ఇబ్బంది పెట్టడానికి చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకడం లేదు. దీంతో పేద ప్రజలు లో అశాంతి, అలజడి రేగుతోంది. దీన్నికి న్యాయం చేయాలని కోరుతున్న ప్రజాప్రతినిధులను కూడా అధికారులు లెక్కచేయడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి. పైగా కబ్జాలకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించడంతో వారు కూడా పేద ప్రజలకు ఏమి సహాయం చేయలేని దుస్థితి నెలకొందని తెలుస్తోంది. దీన్ని బట్టే తెలుస్కోవచ్చు పరిస్థితి ఎంత దారుణం గా ఉందో.అదేవిధంగా ఇదే చట్టాలను అడ్డం పెట్టుకొని పేదల ఇల్లే కాకుండా, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా తొలగించాలనికి తద్వారా ప్రజల్లో అల్లర్లు, అలజడులు సృష్టించడానికి కూడా కార్యాచరణ రూపొందించుకుంటున్నట్లు సమాచారం.

### ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విశ్వ ప్రయత్నం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భూముల పై నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి సులభంగా క్రమబద్ధీకరణ కలెక్టర్లచే చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వానికి పేద ప్రజలలో మంచి పేరు వస్తోంది. ఈ తరుణంలో ప్రభుత్వానికి ఈ విధంగా చెడ్డ పేరు రావడానికి జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు జనసేన పేరు చెప్పుకొని, సుప్రీంకోర్టు, సమాచార హక్కుచట్టం ఆయుధాలుగా చేసుకొని ప్రభుత్వ భూములు, ట్యాంక్ పోరంబోకు భూములు పై నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని ముప్పుతెప్పులు పెట్టి అధికారులను, పేద ప్రజలను వేధిస్తున్నారు. ఇలా చేయని అధికారులును వారు గతంలో చేసిన స్కాములు బయటపెట్టి సస్పెండ్ చేయించడమే కాకుండా ఉద్యోగం ఊడిపోయేలా చేస్తామని భయపెడుతున్నట్లు సమాచారం.తద్వారా ప్రభుత్వాన్ని అస్థిర పర్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.కూటమి ప్రభుత్వం లో చీలిక తెచ్చే టందుకు ఇదో ప్రయత్నం అని ప్రచారం.

### సీఎం, డిప్యూటీ సీఎం తక్షణమే ఆదుకోవాలి

ఒకవైపు పేద ప్రజలలో అలజడి, అశాంతి, అల్లర్లు సృష్టించడానికి, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి సుప్రీంకోర్టు, సమాచార చట్టం అడ్డం పెట్టుకుని కొందరు వ్యక్తులు జనసేన పార్టీ ముసుగులో చేస్తున్న ఈ దందా ను తక్షణమే యుద్ధ ప్రాతిపదికన అడ్డుకొని చర్యలు తీసుకుని పేద ప్రజలను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ను పేద ప్రజలు కోరుతున్నారు.

### 2026 నుంచి చట్టాలు అమలు చేయాలి

ప్రభుత్వ భూములు, ట్యాంకు పోరంబోకు భూములు గట్లపై లపై నివసిస్తున్న వారికి, ఆయా పేదల కుటుంబాలకు రక్షణ కల్పించి, శాశ్వత దృవ పత్రాలు అందజేయాలని కోరుతున్నారు. కొందరు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే టందుకు వీరు నివాసాలను తొలగించాలని కొందరు స్వార్థపరుల ప్రయత్నాలను తిప్పి కొట్టాలని కోరుతున్నారు.స్థలం స్వభావం కాకుండా ప్రభుత్వానికి గాని, ప్రజలకు గాని అభ్యంతరం లేని అన్ని నివాసాలను క్రమబద్ధీకరించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంలో కొందరు స్వార్థపరులు వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టాలని కోరుతున్నారు.అదేవిధంగా సుప్రీంకోర్టు చట్టం 2026 నుంచి ఆక్రమణలు చేసే వారికి మాత్రమే వర్తింపజేసేలాగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చి, అమలు దిశగా చర్యలు తీసుకోవాలని పేద ప్రజలు కోరుతున్నారు.

# శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులు



**కాత్రేనికోన , ఫిబ్రవరి 10,మనం ప్రతినిధి :** శివరాత్రికి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరి నెల 13,14, మరియు 15 తేదీలలో శ్రీశైలం కు ఉదయం 9.30, సాయంత్రం 5.30,6.15,6.45 గం.లకు మరియు రాత్రి 7.00 గం.లకు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేస్తామని, వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలదనీ, ప్రయాణీకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అమలా పురం డిపో మేనేజర్ డి ఎల్ ఎన్ శర్మ తెలియజేశారు. అంతేకాకుండా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15,16 తేదీలలో ఉదయం 5.00 గం.ల నుండి రాత్రి 7.00 గం.ల వరకు ప్రతీ గంటకు కుండలేశ్వరానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలియజేశారు.

# విపక్షాల డైవర్షన్ పాలిటిక్స్ సాగవు

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు
- మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు ఫిబ్రవరి 10 మనం న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధిని, ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక విపక్ష నేతలు 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ మండిపడ్డారు. మంగళవారం నిడదవోలు క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన పర్యాటక ఉత్సవాలకు ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించిందని, ప్రభుత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని మంత్రి దుర్గేష్ తెలిపారు. అయితే, ఈ మంచి పేరును సహించలేని వైకాపా నేతలు సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.ప్రతిపక్ష హోదా లేకపోయినా అత్యుత్సాహం ప్రదర్శిస్తూ, ఓదార్పు యాత్రల పేరుతో అశాంతిని సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. పరామర్శలకు వెళ్లేవారు బలప్రదర్శనలు చేయాల్సిన అవసరం ఏముందని, ఆ యాత్రల వల్లే సామాన్య ప్రజలు ఇబ్బంది పడటమే కాకుండా కొందరు ప్రాణాలు కోల్పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రభుత్వానికి సహకరించాలని, నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని వైకాపాకు సూచించారు. రేపటి నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలపై మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. 'నెల రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అవసరమైన కీలక చట్టాలను కూటమి ప్రభుత్వం రూపొందిస్తుందని' తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూనే అసెంబ్లీ సమావేశాల్లో చురుగ్గా పాల్గొంటానని, నిడదవోలు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు సమీకరిస్తున్నామని వెల్లడించారు.



### విద్యాసంస్థలకు మంత్రి దుర్గేష్ స్ట్రాంగ్ వార్నింగ్

విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి దుర్గేష్ పాఠశాల, కళాశాల యాజమాన్యాలను హెచ్చరించారు. స్కూల్, కళాశాల బస్సుల నిర్వహణలో అలసత్వం వహిస్తే సదరు విద్యాసంస్థలను మూసివేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే సివిల్ చర్యలతో పాటు కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.


# ఆ నిబంధన ఉద్యోగ భద్రతకు ముప్పు

- ఏపిటిఎఫ్ భీమవరం కార్యవర్గం

**భీమవరం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణ వయసు రాకుండానే 33 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుంటే ప్రజాప్రయోజనాల దృష్ట్యా పదవీవిరమణ చేయించే అధికారం నియామక అధికారికి ఉంటుందని నూతన సివిల్ ఏపీ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు-2026 ముసాయిదాలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడంపై ఉద్యోగ, ఉపాధ్యాయలోకం ఆందోళన వ్యక్తం చేస్తోందని ఏపీటీఎఫ్-1938 పశ్చిమగోదావరిజిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు వీరవల్లి రమేష్, అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు హరికృష్ణ, రమణ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గరిష్ఠ సర్వీసు 33 ఏళ్ల తర్వాత ఉద్యోగులను పదవీ విరమణ చేయించే నిబంధనపై స్పష్టత లేకపోవడం తో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందించేందుకు సిద్దమయ్యాయని వారు తెలిపారు. దీర్ఘ కాలిక అనారోగ్యం, ఇతర కారణాల దృష్ట్యా ఎక్స్ ట్రా ఆర్డినరీ సెలవులు వినియోగించుకున్నప్పటికీ పెన్షన్ లో నష్టం జరగకుండా చూడాలని, గరిష్ట సర్వీసుపై పరిమితులు లేకుండా ముసాయిదాలో తగు మార్పులు చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# జీవిత బీమా చెక్కు అందజేత




**కాత్రేనికోన, ఫిబ్రవరి 10, మనం ప్రతినిధి:** ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పి ఎం జె జె బి వై) పథకం ద్వారా వార్షిక ప్రీమియం కేవలం 436 రూపాయలు చెల్లించడం ద్వారా సహజ మరణం పొందిన ఖాతాదారునికి రెండు లక్షల రూపాయల జీవిత బీమా లభిస్తుందని కాత్రేనికోన స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జి బి వి రమణ తెలిపారు. కాత్రేనికోన మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన పెయ్యిల దుర్గా రావు ఇటీవల మరణించగా ఆయన భార్య భవానీ కి రెండు లక్షల రూపాయల బీమా చెక్కును శుక్రవారం మేనేజర్ అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ జీవిత బీమా, ప్రమాద బీమా పాలసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ మహేష్ బాబు,స్టేట్ బ్యాంక్ సిబ్బంది, కియోస్క్ బ్యాంక్ ఆపరేటర్లు పెయ్యాల సురేష్ బాబు, పాలెపు సత్యానందం , మల్లాది రాంబాబు పాల్గొన్నారు.



# ఊరి బడిని కాపాడుకుందాం

**కాత్రేనికోన, ఫిబ్రవరి 10(మనం ప్రతినిధి):** ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం ఊరుబడిని కాపాడుకుందాం, గోడ పత్రిక, కరపత్రాలను కాత్రేనికోన మండలం అభివృద్ధి అధికారి బి. రాజేశ్వరరావు మరియు మండల విద్యాశాఖ అధికారులు ఎం . వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాశాఖ అధికారి గార్లు, మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పట్ల యుటిఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి బలోపేతం చేయడానికి యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎంకే పేరి శెట్టి, రాష్ట్ర కౌన్సిలర్ జి పెద్దరాజు, మండల అసోసియేట్ అధ్యక్షులు ఎంమ్. సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎండి అబ్దుల్ సత్తార్, మహిళా అసోసి యేట్ జి సౌజన్య,ఏ శ్యామల, పి జగన్, షేక్ మస్తాన్ బాబా, కే రేణుకా ప్రసాద్, ఎన్ గోపాలకృష్ణ, ఎం శ్రీరామచంద్రమూర్తి.తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు భరోసాగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం



- తోట సీతారామలక్ష్మి

**భీమవరం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** పేదల ఆరోగ్యమే మహాభాగ్యంగా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పనిచేస్తున్నారని తెదేపా పోలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్చార్జ్ తోట సీతా రామలక్ష్మి అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ పేదలకు భరోసాగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థ సారథి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, వార్డుల నుండి వచ్చిన దరఖాస్తులను ముఖ్యమంత్రి ఆర్థిక సహాయానికి తోట సీతారామలక్ష్మి సిఫార్సు ద్వారా నేటి వరకు సుమారు కోటి రూపాయల చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని ఈరోజు 44 మందికి 27 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, ఏ.ఎం.సి చైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు, ఇందు కూరి రామలింగరాజు, గంటా త్రిమూర్తులు, ఉప్పులూరి చంద్రశేఖర్, పామర్తి వెంకటరామయ్య, ఎండి షబీనా బేగం, చెరుకుపల్లి సంతోష్ కుమార్, యరకరాజు గోపాలకృష్ణ రాజు, అల్లూరి సుబ్రహ్మణ్యరాజు, పొత్తూరి బాపిరాజు నేదునూరి గంగాధర్ తిలక్, ఎండి షాభు, ఎండి నౌషాద్, మెంటే గోపి, పడమట సోమేశ్వరరావు, మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, కోళ్ల నాగబాబు, గొల గాని రమేష్ చెరుకు తిరుపతిరావు, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తూట్ ఫిన్ కార్ప్ లిమిటెడ్‌తో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఎంఓయూ

**రాజమండ్రి ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా కంపెనీ హెచ్డీఎఫ్సీ లైఫ్ కేరళలోని తిరువనంతపురంలో ప్రధాన కార్యాలయం కలిగిన ముత్తూట్ పప్పచన్ గ్రూప్ (ముత్తూట్ బ్లూ) యొక్క ప్రధాన సంస్థ అయిన ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ కస్టమర్లు హెచ్డీఎఫ్సీ లైఫ్ యొక్క సమగ్రమైన గ్రూప్ మరియు వ్యక్తిగత జీవిత బీమా పరిష్కారాలను యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుంది. ఇందులో రక్షణ మరియు దీర్ఘకాలిక పొదుపు ఉత్పత్తులు ఉన్నాయి. వీటిలో వారి వారి అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను చేరుకోవచ్చు. వీటిని ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క 3750 కి పైగా శాఖల విస్తృత నెట్వర్క్ ద్వారా మరియు దాని డిజిటల్ ప్లాట్ఫామ్ ద్వారా అందించబడుతుందని హెచ్డీఎఫ్సీ లైఫ్ డైరెక్టర్ విభా పడాల్కర్ తెలిపారు. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్తో మా భాగస్వామ్యం '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని సాధించే దిశలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందన్నారు. ము త్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క విలువైన కస్టమర్లకు, ఇప్పటికే ఉన్న మరియు కొత్త, ప్రభావవంతమైన జీవిత బీమా పరిష్కారాలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. ఇది వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వీలు కల్పిస్తుంది. ఇంకా, మా ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క టచ్పాయింట్లలోని బృందాలు.. వారి కస్టమర్లకు ఆనందదాయకమైన అనుభవాన్ని అందించడానికి డిజిటల్గా సాధికారత పొందేలా చేస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా, దేశంలో జీవిత బీమా పరిధిని విస్తరించడానికి మరియు ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి మేము ఎదురు చూస్తున్నాము. అని అన్నారు. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ డైరెక్టర్ షాజీ వర్గీస్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం 3,750 కి పైగా శాఖల పరిధి, డిజిటల్ ప్లాట్ఫారమ్లు, మిలియన్ల మంది వినియోగదారులతో మాకున్న సంబంధాలు మరియు హెచ్డిఎఫ్సి లైఫ్ యొక్క ఉత్పత్తి మరియు రిస్క్ నైపుణ్యాన్ని కలిపి భారతీయ కుటుంబాలకు అర్థవంతమైన రక్షణను అందిస్తాయని చెప్పారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**నరసాపురం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** నరసాపురం లయన్స్ క్లబ్, ఫెమినా లయన్స్ క్లబ్ మరియు బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టేలర్ హై స్కూల్ గ్రౌండ్ వద్ద ఉన్న జై రాజేంద్ర లయన్స్ సర్వీస్ సెంటరులో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్.వి.ఎస్ పాపారావు నాయుడు, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ మేకా శ్రీరామ్ సురేష్, నరసాపురం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొండపాటి చిట్టి బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకోగా 70 మందికి ఆల్ట్రా సౌండ్ పరీక్షలు, 70 మందికి మామోగ్రఫీ పరీక్షలు, 150 మందికి పాప్స్మెర్ పరీక్షలు నిర్వహించగా 20 మందికి ఎక్సరే నిర్వహించడం జరిగిందని బసవతారకం ఇండో- అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ మేనేజర్ లక్ష్మణ్ తెలిపారు. ఈ ఉచిత స్క్రీనింగ్ శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొండపాటి చిట్టిబాబు, సెక్రటరీ రంగినీడి భరణి, ట్రెజరర్ సలాది రామారావు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు, మాజీ ప్రెసిడెంట్ అందే రంగారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పిఎస్ఎన్ మూర్తి, సుంకర రమేష్, పులపర్తి ప్రతాప్, ఫెమినా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నా లక్ష్మి, సెక్రటరీ పిల్లి ఝాన్సీలక్ష్మి, ట్రెజరర్ రఘువాణి పాల్గొనగా బసవతారకం ఇండో- అమెరికన్ కేన్సర్ ఆసుపత్రి గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులు డాక్టర్ రేణుక, డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ సౌమ్య, డిఎంవో డాక్టర్ అబ్దుల్, రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రభాకర్, వైద్య సిబ్బంది ఓదెమ్మ, వినోద, క్రిస్టమ్మ, స్వప్న, కృపమ్మ, భార్గవ్, ఆంజనేయులు, ప్రభాకర్, రవీందర్, అరవింద్ సమ్మక్క తదితరులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు.





# అభివృద్ధికి ప్రతీకగా బందరును తీర్చిదిద్దుతా

## ఇప్పటికే రూ.54 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణం

## రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు తొలి ప్రాధాన్యం

## మచిలీపట్నంలో పలు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ, ఫిబ్రవరి 10(మనంన్యూస్):** మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రతి వీధికి, ప్రతి గ్రామానికీ మంచినీటి సదుపాయం, రోడ్ల నిర్మాణం చేపట్టి అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధి హామీ నిధుల్లో రూ.90 లక్షలతో మంగినపూడి బీచ్ వద్ద, రూ.60 లక్షలతో పోతేపల్లి జ్యూవెలరీ పార్కు వద్ద సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పోతేపల్లి జ్యూవెలరీ పార్కులోని పలు పరిశ్రమలు, షాపుల్లో కలియదిరిగారు. జ్యూవెలరీ తయారీ, ప్యాకింగ్, మార్కెటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. పోతేపల్లి జ్యూవెలరీ పార్కు మన అస్తిత్వానికి నిదర్శనం. అలాంటి కళను కాపాడుకోవడంతో పాటుగా, తగిన గుర్తింపు తీసుకు రావడం, పారిశ్రామికవేత్తలకు సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెడతానన్నారు.

అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మచిలీపట్నంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.54 కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు అన్నింటినీ అభివృద్ధి చేస్తున్నాం. మంగినపూడి బీచ్ను అభివృద్ధి చేస్తున్నందువలన జనాభా పెరుగుతున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. అదే సమయంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కూడా రోడ్లను పూర్తి చేశాం. డ్రైన్లను కూడా పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.పోతేపల్లి జ్యూవెలరీ పార్కును మోడల్ పార్కుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతానికి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలున్నాయి. ఎంతో ప్రఖ్యాతిగాంచిన గోల్ కవరింగ్ జ్యూవెలరీ పరిశ్రమలున్నప్పటికీ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసంది. ప్రధానంగా డ్రైనేజీ సమస్యల కారణంగా ఇక్కడ పని చేసే మహిళలు అనారోగ్యం పాలవుతున్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణంతో పాటుగా, డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్లపై ఎక్కడా మురుగు నిలిచేందుకు ఆస్కారం లేకుండా చూడాలని, అవసరమైతే రోడ్డును ఎత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో రాజ్యసభ సభ్యులు చిరంజీవి గారి నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

ఆటోనగర్ ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంకు లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. త్వరలోనే ఏపీఐఐసీతో సంప్రదించి ఆటోనగర్లో ఓవర్ హెడ్ ట్యాంకర్ ఏర్పాటు చేస్తాం. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినప్పటికీ గత ఐదేళ్ల నిర్లక్ష్యంతో ట్రాక్ పాడైంది. భవిష్యత్తులో మరింత సుందరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రచిస్తాను. మోడల్ పార్కుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతానని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు గారు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ గారు, గోపు సత్యన్నారాయణ గారు తదితరులు పాల్గొన్నారు.

# షూటింగ్ బాల్ విజేతగా స్వర్ణాంధ్ర విద్యార్థిని



**నరసాపురం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బిటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ చదువుతున్న ఏ. జాహ్నవి ప్రియ ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 డిసెంబరులో కావలిలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని ప్రథమస్థానం సాధించగా ఫిబ్రవరి 7, 8వ తేదీలలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఆరట్స్ కళాశాలలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయిలో తృతీయ స్థానం సాధించింది.

ఈ సందర్భంగా జాహ్నవి ప్రియ సాధించిన విజయాలకు స్వర్ణాంధ్ర కళాశాల మేనేజ్మెంట్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ గోపీచంద్, సి.ఎస్.సి. విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

# క్షుద్ర రాజకీయాలకు బలవుతున్న తిరుమల పెద్ద జీయ్యంగార్: వైసీపీ నేత భూమన




**తిరుపతి, ఫిబ్రవరి 10 మనం న్యూస్ :** వెంకటేశ్వర స్వామి ఆలయ సంప్రదాయాలకు, ఆచారాలకు భిన్నంగా మొదటి సారిగా పెద్ద జీయంగార్ తో మఠం లేఖ రాయించారని వైసీపీ నేత భూమన కరుణాకర రెడ్డి ఆరోపించారు. అయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ హోమంలో వాడుకునేందుకు చంద్రబాబు, బి.ఆర్.నాయుడు, ఈవో రవి చంద్ర ఆడుతున్న దాంట్లో సిద్ధం అయ్యారని అన్నారు.

సెప్టెంబర్ 23 ....2024 బంగారు బావి దగ్గర శాంతి హోమం, ఆలయ సంప్రోక్షణ చేశారు. ఇక మీదట తప్పులు జరగవని, దోషాలు ఉండవని అప్పటి ఈవో శ్యామల రావు , జె.ఈ. వో తో కలిసి వాస్తు శుద్ధి ,శాంతి హోమం చేశారని తెలిపారు.

లడ్డు విషయంలో చంద్రబాబు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారని, లడ్డు లో ఆవు కోవ్వు, ఫిష్ ఆయిల్, పంది కొవ్వు కలవలేదని సిట్ రిపోర్ట్ ఇచ్చిన తర్వాత కూడా విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. హిందూ మతం విద్వేషాలు రెచ్చగొట్టడానికి లడ్డు విషయం తీసుకువచ్చారు జగద్గురువు రామానుజాచార్యులు పరంపర లో ఉన్న పెద జీయర్ మఠం కూడా పావుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ హయాంలో,జగన్ మోహన్ రెడ్డి పాలనలో అర్థిక ఇబ్బందులు తో జీయర్ మఠం కు టిటిడి ధన సహాయం పెంచిన వాస్తవం గుర్తు చేస్తున్నానని తెలిపారు.

# మారేడుమిల్లి వెదురు టింబర్ డిపోలో ఏం జరుగుతోంది..?

## లెక్కల మాటున లూటీనా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా ..?




**మారేడుమిల్లి, మనం న్యూస్, ఫిబ్రవరి 10:** మారేడుమిల్లి మండలంలోని వెదురు కలప టింబర్ డిపోలో అవినీతి జరుగుతోందన్న మాటలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి. ప్రజలకు నిరంతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు కార్పొరేషన్ ఫారెస్ట్ ద్వారా వెదురు సాగును ప్రోత్సహించాయి. ఏజెన్సీ ప్రాంతమైన కూడురు, కొల్లూరు,మద్దూలూరు, కూడురు, ఇలా పలు గ్రామాల్లో వెదురు మొక్కలు నాటి, ఒకవైపు ప్రభుత్వానికి ఆదాయం, మరోవైపు గిరిజనులకు జీవనాధారం కల్పించేలా ఉద్దేశంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సంబంధిత ప్రాంతాల నుండి సేకరించిన వెదురు కలపను టింబర్ డిపోలలో నిల్వ చేసి, వేలం ద్వారా టెండర్లకు అప్పగించి, అధికారిక లెక్కల ప్రకారం లారీల్లో లోడ్ చేసి తరలించాల్సి ఉంటుంది. కానీ ఈ లెక్కలే ఇప్పుడు అనుమానాలకు దారితీస్తున్నాయనే ప్రశ్నలు స్థానికుల్లో మెదులుతున్నాయి.

సంబంధిత సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ లెక్కల పేరుతో వెదురు కలపను అక్రమంగా తరలించేందుకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇలా జరగడం కొత్త విషయం కాదని, గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కలకంటే అధికంగా వెదురు లోడ్ చేసి తీసుకెళ్తుండగా రెండు లారీలు చెక్పోస్ట్లో పట్టుబడ్డ ఘటన ఇప్పటికీ మరువలేనిదని చెబుతున్నారు. ఆ సమయంలో అదనపు వెదురు బయటపడటంతో లారీలను సీజ్ చేసి, సంబంధితుల నుంచి పై స్థాయిల వరకు డబ్బులు కట్టించుకున్నారన్న ప్రచారం అప్పట్లో సంచలనం సృష్టించింది.అయినా ఆ సంఘటనల నుంచి పాటలు నేర్చుకోవాల్సిన అధికారులు అదే ధోరణిలో వ్యవహరిస్తున్నారని అనుమానాలు టింబర్ డిపోలో పనిచేసే కూలీలు చిన్న స్థాయి ఉద్యోగస్తులు గుసగుసలాడుకుంటున్నారు...

తాజాగా ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంపై టింబర్ డిపోలో పనిచేస్తున్న కొంతమంది చిన్న స్థాయి ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవినీతిని ప్రశ్నిస్తే ఉద్యోగ భద్రత ఉండదన్న భయం నెలకొంది అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అధికారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇద్దరు నుంచి ముగ్గురు వరకు గిరిజన ఉద్యోగులు పని మానేసినట్లు సమాచారం.

ఇది గిరిజన ఉపాధి లక్ష్యాలపై నేరుగా దెబ్బతీసే పరిస్థితి కాదా గిరిజనుల జీవనాధారమైన వెదురు కలప కొందరి స్వార్థానికి బలవుతోందనే ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి.కోట్ల రూపాయల అటవీ ఆదాయంపై అనుమానాలు తలెత్తుతున్న ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

# అనకాపల్లి జేసీగా సౌర్య మాన్ పటేల్



**అనకాపల్లి మనం బ్యూరో ఫిబ్రవరి 10:** అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్గా సౌర్య మాన్ పటేల్ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ డ్రోన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. 2022 ఐఏఎస్ బ్యాచ్కు చెందిన సౌర్య మాన్ పటేల్ 2021 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 281వ ర్యాంక్ సాధించారు. ఐఐటీ కాన్పూర్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన గతంలో పాడేరు సబ్ కలెక్టర్గా పనిచేశారు.ఈ పోస్టుకు తొలుత మల్లవరపు సూర్య తేజను నియమించినప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల ఆయన జాయిన్ కాలేదు. దీంతో సూర్య తేజను ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్గా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు సేవలు ప్రశంసనీయం



**విశాఖపట్నం,(మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి):** ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు శాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె. సదారావు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, ప్రజలతో అనుసంధానం, మీడియాతో సమన్వయం వంటి అంశాలలో వారు సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. డివిజనల్ పీఆర్వోలుగా పదోన్నతి పొందిన సందర్భంగా మంగళవారం స్థానిక సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వారిద్దరినీ ఆత్మీయంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి, దుశ్శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో సేవలు అందించాలని, కొత్త బాధ్యతల్లోనూ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ పనితీరును కనబరిచి అందరి ప్రశంసలూ అందుకోవాలన్నారు. శ్రీనివాసరావు పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు వెళ్తుండగా, వెంకటరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్, సీనియర్ అసిస్టెంట్ లావణ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు.

# కోటగున్నల వద్ద కోటిన్నర విలువయిన 308 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్ - నలుగురు పరారీ



**చింతపల్లి : ఫిబ్రవరి : 10 మనం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి పోలీస్ సబ్ డివిజన్ అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటగున్నల గ్రామం వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 308 కేజీల గంజాయిని పోలీసులు చాకచక్యంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ సుమారు కోటిన్నర రూపాయలు ఉంటుందని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన, విశ్వసనీయ సమాచారం మేరకు అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గాలింపు చర్యలు చేపట్టామని, ఆ సమయంలో కోటగున్నల గ్రామం వద్ద భారీగా గంజాయి నిల్వ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారి వద్ద నుంచి రెండు మోటార్ వాహనాలు, రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టైన వారిని కోర్టులో హాజరు పరచి రిమాండ్కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కేసును సమర్థవంతంగా నిర్వహించిన చింతపల్లి సీఐ వినోద్బాబు, అన్నవరం ఎస్ఐ సాయి కుమార్లను ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అభినందించారు. పరారీలో ఉన్న మిగిలిన నలుగురిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం ప్రాంతంలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలించబడిందని, ఇక్కడి గిరిజనులు సంప్రదాయ పంటల వైపు దృష్టి సారించారని తెలిపారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి అటవీ మార్గాల ద్వారా గంజాయి రవాణా జరుగుతున్నట్లు చెప్పారు. దీనిని అరికట్టేందుకు అనుమానాస్పద రహదారులపై రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని ముమ్మరం చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సి ఐ వినోద్ బాబు ఎస్ ఐ లు ఎం వెంకటరమణ, సాయి కుమార్ లు పాల్గొన్నారు.

# సచిన్ టెండూల్కర్ ను కలిసిన బగ్గు అర్చన



**నరసన్నపేట: ఫిబ్రవరి 10(మనం న్యూస్):** భారత క్రికెట్ దిగ్గజం శ్రీ సచిన్ టెండూల్కర్ గారిని నియోజకవర్గ సమన్వయ కర్త, యువ నాయకురాలు శ్రీమతి బగ్గు అర్చన న్యూఢిల్లీ ఎయిర్ పోర్ట్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత క్రికెట్కు ఆయన చేసిన అపూర్వ సేవలను స్మరిస్తూ, యువతకు ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం ఎప్పటికీ మార్గదర్శకమని తెలియజేశారు

ఆయనతో కాసేపు ఆత్మీయంగా మాట్లాడే అవకాశం లభించడం నాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు.

# గాజువాక జోన్ పరిధిలో సమీక్ష సమావేశం



**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి:** గాజువాక జోన్ పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేస్తారు జ. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం మాట్లాడుతూ పెట్రోల్ బంక్ నుండి కుర్మన్నపాలెం, గాంధీ బొమ్మ జంక్షన్ నుండి బరియల్ గ్రౌండ్ వర్క్ ఉన్న రోడ్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనీ, స్పోరట్స్ కాంప్లెక్స్ లో తొలిగించిన వాటర్ ట్యాంక్ స్థానంలో కొత్త 500 కేఎల్ ట్యాంక్ ఎర్పాటు చెయ్యాలని, వార్డు పరిధిలో కమ్యూనిటీ హాల్స్ కొరకు అప్పటి జిల్లా కలెక్టర్ ఇంచార్జ్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించడం జరిగిందని నేటికీ ఎటువంటి పరిష్కారం లేదని, ప్రధాన గెడ్డ బ్యాలెన్స్ వర్కు మరియు రెండు బాక్స్ కల్వర్టులు నిర్మాణం కొరకు స్టాండింగ్ కమిటీ ఎజెండాలో వచ్చేలా కృషి చేయాలని,పార్కులు అభివృద్ధి చెయ్యాలని, గాంధీ బొమ్మ జంక్షన్లో గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని, కుర్మన్నపాలెం నుండి వడ్లపూడి వరకు ఉన్న ప్రధాన కాలవను ఆర్ అండ్ బి వారితో డెవలప్ చేయించాలని, వడ్లపూడిలో ఉన్న సిగ్నల్ లైట్లు వినియోగంలోకి తేవాలని పై సమస్యలపై లిఖితపూర్వకంగా ముఖ్య అతిథులకు అందజేసి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తియే విదంగా కృషిచేయాలనీ కోరారు.

ఈ కార్యక్రమంలో జోన్ పరిధిలో ఉన్న కార్పొరేటర్లు,జోనల్ కమిషనర్ జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## రీజనల్ ఐ, చెస్ట్ హాస్పిటల్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**విశాఖపట్టణం,(మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 10):** రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ టీబీ ఛాతీ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, శుభ్రత నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆధునిక వైద్య పరికరాల వినియోగం, ప్రయోజనాల గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడి చికిత్సపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

రోగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సునీల్ కుమార్, రీజనల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. మీనాక్షి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు ఇతర వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి



**కుక్కునూరు, ఫిబ్రవరి 10 ( మనం న్యూస్):** పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగేలా బడ్జెట్ కేటాయింపులు చెయ్యాలని చట్టసభలో ప్రశ్నిస్తాను అని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. మంగళవారం నాడు మండలంలోని విద్యాసంస్థలను పర్యటించి 2024 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసి శాసన సభకు పంపించినందుకు గాను ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందరికి కృతజ్ఞతలు తెలియజేయాలని ఉద్యేశంతో కృతజ్ఞత పర్యటన పేరుతో మండలంలో తిరిగి పలు సమస్యలను కూడ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధం లారీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయడంలో లోటు జరుగుతుంది. కాంటూర్ తో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనీట్గా తీసుకుని 2023 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, తరలించేనాటికి 18 సంత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మరో పక్క ముంపు పేరుతో మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు కేటాయింపు చేయకుండా అభివృద్ధి చేయకుండా పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని విమర్శించారు. మండల కేంద్రంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిద్రించడానికి కానీ,మరుగుదొడ్ల కానీ,స్నానం చేయడానికి కానీ సరిపడా వసతులు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలలో త్రాగడానికి మంచినీళ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు, విటిపైన శాసన సభలో ప్రశ్నిస్తాను అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా ఉన్న 29 కార్మిక చట్టాలను,ప్రవేట్,కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి,కార్మికుల శ్రమ దోపిడీక్కి,పెట్టుబడిదారులు,కార్పొరేట్ సంస్థలకు ఉపయోగ పడతాయి కానీ,కార్మికులకు తీవ్రమైన నష్టం చేస్తుందని మండిపడ్డారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలని, ఈ సమ్మెకు పిడిఎఫ్ గా మద్దతు తెలియజేస్తున్నాము అని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానారి బాలకృష్ణ, కె.వి.పి.ఎస్ నాయకులు కోట మోహన్ రావు, లారీ యూనియన్ కార్యదర్శి మహమ్మద్ వలిపాషా, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్షమయ్య, లారీ యూనియన్, సిఐటియు నాయకులు,కారం రమేష్,ఓగిరాల నాగరాజు,మహేష్,వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# భద్రాచలం పాదయాత్ర భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహణ



**కుక్కునూరు, ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** భద్రాచలం రాములోరి పాదయాత్రలో భాగంగా మంగళవారం వారి యాత్ర కుక్కునూరు చేరుకున్న సందర్భంగా భద్రాచలం రామయ్య భక్తులకు టీడీపీ కుక్కునూరు మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరావు స్వాగతం పలికి అయన ఆధ్వర్యంలో ఉదయం స్థానిక కొత్త రామాలయం వద్ద కుచ్చర్లపాటి రమణారాజు నివాసంలొ అల్పాహారం కార్యక్రమం ఏర్పాటు చేశారు.అనంతరం ఇక్కడి నుండి భక్తుల జన సందోహం కోలాటం మధ్య భక్త బృందం నాగు నివాసానికి చేరుకుంది. ఆయన నివాసంలో కూడా మజ్జిగ పంపిణి కార్యక్రమం నిర్వహించి ప్రధాన గురూజీ దగ్గర కుటుంబం సమేతంగా ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ యొక్క భద్రాచలం పాదయాత్ర కాకినాడ నుండి, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు భద్రాచలం శ్రీరామచంద్రస్వామిని దర్శించుకోవడానికి పాదయాత్ర చేస్తారు. అందుకు అనుగుణంగా భద్రాచలం రామయ్య యాత్ర భక్తులు కు ములిశెట్టి నాగు పుణ్యక్షేత్రాలకు వెళ్లే పాదయాత్ర భక్తులకు గత 10 సంవత్సరాలనుండి తన మండలం అయిన కుక్కునూరు చేరుకోగానే మధ్యంలో ఆహారం తాగునీరు అందిస్తూ, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటున్నారు. అందులో భాగంగా కొండపల్లి గ్రామం లొ కూడా మధ్యాహ్నం రావి ప్రసాద్ నివాసం లొ అన్నదాన కార్యక్రమం నిర్వహించి తన భక్తిని, దాన గుణంను మరొక్కసారి చాటుకున్నారు. ఈ కార్యక్రమం లొ టీడీపీ అధ్యక్షుడు ములిశెట్టి నాగు, స్థానిక ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, చుంచు సత్యనారాయణ, నకిరికంటి భాస్కర్ రావు, పులి శ్రీను,అంగీరేకుల బాలాజీ, చిలకల మల్లయ్య, జనసేన మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ, సీత రామయ్య,బీజేపీ నాయకులు వాడపల్లి లక్ష్మణ చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో భక్తులకు సౌకర్యాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

- ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో నే భక్తుల పై దాడి
- ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వసతులు కల్పించాలి
- మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



మంత్రాలయం , ఫిబ్రవరి 10 మనం న్యూస్: శ్రీశైలం లో భక్తులకు సౌకర్యాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన మీడియాతో ఫోన్లో మాట్లాడుతూ శివరాత్రి పండుగ ను పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి ని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో శివ మాల ధరించి ఇరుముడితో వస్తుంటారు. వీరికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో భక్తుల అధిక సంఖ్యలో తరలి రావడంతో రద్దీ పెరిగి పోయింది. దీంతో గంటల తరబడి క్యూ లైన్లో నిలిచి ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో కొంత మంది శివ స్వాములు బారి కేడ్లు తొలగించి బయటకు రావడం తో సహనం కొల్పోయిన పోలీసులు ఏకంగా లాఠీ ఛార్జి చేయడం చాలా దారుణమన్నారు. ఫారెస్టు అధికారులు, దేవస్థానం అధికారులు ముందుగానే చర్చించి 1వ తేది నుంచి శివ స్వాములకు అనుమతి ఇచ్చింటే ఈ ఇబ్బందులు వచ్చేవి కాదని మండిపడ్డారు. ఇటీవల ఎమ్మిగనూరు మండలం కల్లుగోట్ల గ్రామంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం లడ్డులో కూడా కల్తీ నెయ్యి కలిపారని మాట్లాడటం పద్దతి కాదు. ఎలాంటి ఆధారాలు లేకుండా భక్తుల మనో భావాలను దెబ్బ తీసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడటం సిగ్గు చేట్టన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదే విధంగా టీటీడీ తరహా లో క్యూ లైన్లో ఉండే భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసి, క్యూ లైన్లలకు అనుగుణంగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా భక్తులు స్నానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లడ్డు, ప్రసాదం విషయాల్లో కూటమి నాయకులు వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# 100% ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ



**కర్నూలు ఫిబ్రవరి 10 మనం న్యూస్** శంకరాస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ హరికృష్ణ ఆశీస్సులతో కర్నూలు బి.క్యాంప్ ప్రాంతంలోని బాలికల, బాలుర ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ ప్రశ్నాపత్రాలను మంగళవారం నాడు శంకరాస్ మరియు ఆదర్శ విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు ఈ సందర్భంగా శ్రీ ధర్మేంద్ర రూరల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ అధినేత డాక్టర్ వి.ఆర్. రావు మాట్లాడుతూ, విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం తమ వంతు సహాయం అందిస్తున్నామని తెలిపారు.శంకరాస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ హరికృష్ణ చొరవతో ఈ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు అనంతరం రాము యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు కృషి చేసి కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు పాల్గొన్న సుమారు 200 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ సిబ్బంది మరియు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు




# నేడు సమన్వయ సమావేశం

**మహానంది, ఫిబ్రవరి10,మనంన్యూస్:** మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల 30 నిమిశములకు పోచబ్రహ్మానంద విశ్రాంతి భవనంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ డి ఓ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

# జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన సింహాచలం ఈవో





**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధిఫిబ్రవరి 10,** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె. వెంకటరావు మంగళవారం విశాఖపట్నం పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.మొదటగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖా బ్రతా బాగ్చి ని వారి కార్యాలయంలో దేవస్థానం ఈఓ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు కమిషనర్ కి మంత్రపుష్పాలతో వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఈఓ వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను స్వామివారి జ్ఞాపికను బహుకరించారు.అనంతరం జి.వి.ఎం.సి కమిషనర్ కేతన్ గార్గ్, ని ఈఓ కలసి ఆలయ వేద పండితులు కమిషనర్ కి ఆశీర్వచనాలు అందజేయగా, ఈఓ స్వామివారి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి జ్ఞాపికను ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నగర ఆలయ అభివృద్ధి పనుల సమన్వయంపై చర్చించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, వేద పండితులు సురేష్ శర్మ ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డూ మీద అపవాదులు హిందూ విశ్వాసాల్ని చీల్చే కూటమి కుట్ర

- పాలన చేతకాక దేవుణ్ణి అడ్డం పెట్టుకున్న పాలకుల పాపక్రీడ
- హామీలు మరిచిన పాలకులు విశ్వాసాల్ని విషపెట్టిన రాజకీయాలు
- కొర్రపాటి వీరస్వామి.



**పోడూరు ఫిబ్రవరి 10 మనం న్యూస్ :** తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో పంది కొవ్వు, గోడ్డు కొవ్వు, చేప నూనె, రసాయనాలు కలిసాయంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారం, కోట్లాది హిందూ భక్తుల హృదయాలను కలచివేస్తోందని పాలకొల్లు నియోజకవర్గం, పోడూరు మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదం ఒక తినుబండారం కాదు అది హిందూ భక్తుడి నమ్మకం అన్నారు.తల్లి గర్భం లాంటి పవిత్రత అలాంటి ప్రసాదంపై అపవాదులు మోపడం అంటే శ్రీవారినే ప్రశ్నించినట్లేనని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.అభివృద్ధిని అటకెక్కించి, సంక్షేమాన్ని సమాధి చేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేవలం 20 నెలల్లోనే మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి, ఆంధ్రప్రదేశ్ను అప్పుల ఊబిలోకి నెట్టిన చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం, తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే దేవుడినీ రాజకీయానికి బలి చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 భృతి, 50 ఏళ్లు దాటిన ఎస్సీ-ఎస్టీ-బీసీ ప్రజలకు వృద్ధాప్య పెన్షన్, గ్యాస్ బండలపై భారం తగ్గిస్తామన్న హామీ - ఇవన్నీ ఇప్పటికీ నెరవేరని వాగ్దానాలుగా మిగిలిపోయాయని విమర్శించారు.తల్లికి వందనం పేరుతో ఒకరికి రూ.11,000 ఒకరికి రూ.10,000 ఒకరికి రూ.8,000 ఒకరికి రూ.9,000 మరికొందరికి అసలు ఒక్క రూపాయి కూడా పడకపోవడం - ఈ పాలనలోని గందరగోళం, అవ్యవస్థకు సజీవ సాక్ష్యమని ఆయన పేర్కొన్నారు.తన కుమారుడు నారా లోకేష్ రాజకీయ భవిష్యత్తు కోసం, వైయస్ జగన్ మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేని చంద్రబాబు నాయుడు, 2029లో ఓటమి ఖాయమని గ్రహించి, జగన్ మోహన్ రెడ్డి మతాన్ని ఆయుధంగా మార్చి హిందువులను రెచ్చగొట్టే నీచ రాజకీయాలకు దిగారని ఆరోపించారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులు కలవలేదని అది పూర్తిగా ఆ వాస్తవమని సీబీఐ చార్జిషీట్ స్పష్టంగా తేల్చిన సత్యాన్ని కూడా కూటమి ప్రభుత్వం కావాలనే దాచిపెట్టి, భక్తుల మనసుల్లో అనుమానాల విషబీజాలు నాటుతోందని విమర్శించారు. ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రాష్ట్రంలో కుల మత విభేదాలు పెరిగిపోతున్నాయని, ఇది ఆంధ్రప్రదేశ్కు ప్రమాదకరమని హెచ్చరించారు. అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తున్న ప్రజలను విడగొట్టి రాజకీయ లాభాలు పొందాలన్న ప్రయత్నాలు దేవుడి దృష్టిలోనూ పాపమేనని వ్యాఖ్యానించారు. శ్రీవారి లడ్డూ మీద అపవాదులు మోపడం అంటే హిందూ హృదయాన్ని గాయపరచడమేనని, రాజకీయ లాభాల కోసం తిరుమల లాంటి పవిత్ర క్షేత్రాన్ని అపవాదుల అడ్డాగా మార్చిన వారిని హిందూ సమాజం ఎప్పటికీ క్షమించదని కొర్రపాటి వీరస్వామి హెచ్చరించినట్లు తెలిపారు. 2029కు సమాధానం సిద్ధం పాలకొల్లు నుంచి వైఎస్ఆర్సిపి గర్జన ఈ సందర్భంగా కొర్రపాటి వీరస్వామి మాట్లాడుతూ, 2029 ఎన్నికల్లో పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి జెండా రెపరెపలాడుతూ ఎగురుతూ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలను మోసం చేసి, హామీలను విస్మరించి, చివరికి దేవుణ్ణి కూడా రాజకీయానికి వాడుకున్న కూటమి పార్టీ నాయకులు, పాలకొల్లు ప్రజల తీర్పు ఏంటో 2029లో ప్రత్యక్షంగా చూడాల్సిందేనని సవాల్ విసిరారు. హిందూ విశ్వాసాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేసిన ప్రతి నాయకుడికి పాలకొల్లు ఓటరు తగిన గుణపాఠం చెబుతాడని స్పష్టం చేశారు




# కేంద్ర ఉక్కు శాఖా మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

**ఢిల్లీ మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి** వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాల బాట పట్టడంతో కేంద్రానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.కేంద్రం అందించిన ఆర్థిక సాయం, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, స్టీల్ ప్లాంట్ కార్మికులు-ఉద్యోగుల పట్టుదల, శ్రమతో లాభాలు సాధ్యమయ్యాయని కుమారస్వామికి వివరించారు వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడంతో పాటు, పూర్తి స్థాయి సామర్థ్యం మేర పనిచేస్తోందని చెప్పిన సీఎం ఆర్ఐఎన్ఎల్ విషయంలో భవిష్యత్లోనూ ఇంతే తోడ్పాటు, సహకారాన్ని అందించాలని కేంద్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు

# శనగ,త మినుము పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్




**సి బెళగల్, ఫిబ్రవరి 10 మనం న్యూస్:** సి. బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామం నందు పొలం పిలుస్తుందనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి .మల్లేష్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం శనగ మరియు మినుము పంటలో తీసుకోవాల్సిన అటువంటి జాగ్రత్తలు, సస్రక్షణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు. అదేవిధంగా రైతులు శనగ మరియు మినుము పంటలలో ఎక్కువగా కాయ తొలుచు పురుగు లేదా మారుకా మచ్చల పురుగు లేదా గూడూ పురుగు అని కూడా అంటారు. ఈ పురుగు మొగ్గ, పిందె దశలో ఆశించి పంటకు ఎక్కువ నష్టం కలగజేస్తుంది. ఆకులపై పిందెలపై గుడ్లను సుమారుగా 250 నుంచి 500 గుడ్లను పెడుతుంది .ఇవి తెలుపు మరియు పసుపు రంగులో గుంపులుగా ఉంటాయి. ఇవి ఎక్కువగా కాయలకు రంధ్రం చేసి లోపల గింజలు తినడం వలన పంటకు 10 నుంచి 80 శాతం వరకు నష్టం కలుగుతుంది అని తెలియజేశారు. దీని నివారణకు పంట పూత మొగ్గ దశలో ఐదు మిల్లీలీటర్ల వేప నూనెను ఒక లీటర్ నీటికీ కలిపి పిచికారి చేసుకోవాలి .అదేవిధంగా ఆకులపై గుళ్ళనూ గమనించినట్లయితే నోవల్యూరన్ ఒక మిల్లీమీటర్ల లేదా క్లోరోఫైరీఫాస్ 2.5 ఝుజూ లీటర్ నీటికీ కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు, లేదా స్ప్రినోసాడు 0.3 ఝుజూ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. శనగ పంట లో కూడా కుంకుమ తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఏఈవోలు మరియు ఆర్ఎస్కే సిబ్బంది శశికాంత్ రైతులు రాఘవరెడ్డి మరియు సోమిరెడ్డి ,సీమోను తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి పొంగూరు నారాయణ

- అరసవిల్లి అభివృద్ధికి రూ. 2.03 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే గొండు శంకర్
- మొత్తం 5 అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

**శ్రీకాకుళం, :** అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాల అభివృద్ధి విషయంలో గౌరవనీయులైన రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే శ్రీ గొండు శంకర్ గారు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ గారు ఇచ్చిన హామీ మేరకు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరసవిల్లిలో రూ. 203.51 లక్షల (రూ. 2.03 కోట్లు) విలువైన అభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఃఖఊఐఃఇ) ద్వారా పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల మంత్రి నారాయణ గారిని కలిసి అరసవిల్లి క్షేత్ర అభివృద్ధి ఆవశ్యకతను వివరించగా, వారు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన విషయం ఆయన గుర్తుచేశారు. ఆ హామీని నెరవేరుస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మంజూరైన నిధులు - పనుల వివరాలు: ఈ నిధులతో అరసవిల్లిలో చేపట్టబోయే 5 ప్రధాన పనులు ఇవే: 1. రూ. 1.40 కోట్లు: అరసవిల్లి ఇంద్రపుష్కరిణి వెనుక ఉన్న రాంబట్టి ఇరిగేషన్ ఛానల్ వెంబడి 'రిటైనింగ్ వాల్' (ఖ్ఛిఖీజీజీజ గ్చిజూజూ) నిర్మాణం మరియు సి.ఎస్.పి (ఇఖ్కి) రోడ్డు నుండి రిజర్వ్ సైట్ వరకు సి.సి రోడ్డు విస్తరణ. 2. రూ. 22.50 లక్షలు: అరసవిల్లి వెలమ వీధిలో (దేవాలయం ఎడమ వైపు) శంకరం బాబు ఇంటి మీదుగా బొంపడా వీధి రామ్ మందిర్ వరకు సి.సి రోడ్డు మరియు సి.సి డ్రైన్ ఆధునీకరణ. 3. రూ. 21.21 లక్షలు: అరసవిల్లిలోని కాపు వీధి నుండి బొంపడా వీధి వరకు (దేవాలయం కుడి వైపు) సి.సి రోడ్డు మరియు సి.సి డ్రైన్ ఆధునీకరణ. 4. రూ. 9.90 లక్షలు: అరసవిల్లి వెలమ వీధిలోని నీలమ్మ తల్లి గుడి నుండి తోట జంక్షన్ వరకు సి.సి రోడ్డు మరియు సి.సి బెరమ్స్ నిర్మాణం. 5. రూ. 9.90 లక్షలు: అరసవిల్లి వెలమ వీధిలోని నీలమ్మ తల్లి గుడి నుండి తోట జంక్షన్ వరకు దెబ్బతిన్న డ్రైన్ల మరమ్మతులు మరియు కవర్ స్లాబ్స్ ఏర్పాటు. ముఖ్యంగా ఇంద్రపుష్కరిణి వెనుక రక్షణ గోడ నిర్మాణం భక్తుల భద్రతకు మరియు ఆలయ పరిసరాల సుందరీకరణకు ఎంతో కీలకమని, దీనికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రూ. 1.40 కోట్లు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సహకరిస్తున్న గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి మరియు ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీ పొంగూరు నారాయణ గారికి శ్రీకాకుళం ప్రజల తరపున ఎమ్మెల్యే గొండు శంకర్ గారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు గారికి, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గారికి ఆయన ధన్యవాదములు తెలియజేశారు..




## ‘రేజర్’ రెడీ : శరవేగంగా షూటింగ్ ముగించిన రవి బాబు!

విలక్షణ డైరెక్టర్ కమ్ యాక్టర్ రవి బాబు ఇటీవల ‘రేజర్’ అనే చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రముఖ నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఎ ఫ్లయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్ లో తెరకెక్కుతోంది. పూర్తి యాక్షన్ థ్రిల్లర్ గా రానున్న ఈ సినిమాలో రవి బాబు లీడ్ రోల్ లో నటిస్తున్నాడు.

ఇక ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు. ‘రేజర్’ చిత్ర షూటింగ్ ముగిసిందని తెలియజేస్తూ ఓ వీడియోను వదిలారు చిత్ర యూనిట్. రవి బాబు సూపర్ స్పీడ్ తో ఈ చిత్ర షూటింగ్ పూర్తి చేసినట్లు అధికారికంగా ప్రకటించారు.

ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. ఆ తర్వాత ప్రమోషన్స్ నిర్వహించి ‘రేజర్’ చిత్రాన్ని సమ్మర్ కానుకగా మే నెలలో థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# న్యూజిలాండ్ ఓపెనర్ల ఊచకోత..

టీ20 వరల్డ్‌కప్ 2026లో న్యూజిలాండ్ జట్టు వరుస విజయాలతో దూసుకుపోతుంది. తొలి మ్యాచ్లో ఆఫ్ఘనిస్తాన్పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన ఈ జట్టు.. తాజాగా యూఏఈపై 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్ లో యూఏఈ నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని ఓపెనర్లే ఊదేశారు.

ఫిన్ అలెన్ (50 బంతుల్లో 84 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), టిమ్ సీఫర్ట్ (42 బంతుల్లో 89 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) ఊచకోత ధాటికి న్యూజిలాండ్ కేవలం 15.2 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఏ వికెట్కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యంగా నిలిచింది.

సీఫర్ట్-అలెన్ దెబ్బకు యూఏఈ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. వీరిద్దరు పడ్డ బంతిని పడ్డట్టు ఎడాపెడా బాదారు. అలెన్ కాస్త నిదానంగా ఆడినా, సీఫర్ట్ మాత్రం బౌండరీలు, సిక్సర్లతో చెలరేగిపోయాడు. విన్నింగ్ రన్స్ ను కూడా సీఫర్ట్ సిక్సర్ తోనే సాధించాడు.

అలెన్ తన హాఫ్ సెంచరీని 27 బంతుల్లో పూర్తి చేస్తే, సీఫర్ట్ కేవలం 23 బంతుల్లోనే పని కానిచ్చేశాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్ తో జరిగిన గత మ్యాచ్ లోనూ సీఫర్ట్ ఇదే తరహా విధ్వంసం (42 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) సృష్టించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. సీఫర్ట్ ధాటికి ఆ మ్యాచ్ లో ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 17.5 ఓవర్లలోనే ఛేదించింది. సీఫర్ట్ విధ్వంసకర ఫామ్ చూస్తుంటే, ఈ ప్రపంచకప్ లో న్యూజిలాండ్ ను ఆపడం కష్టమేమో అనిపిస్తుంది. అతనికి ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, మార్క్ చాప్ మన్ లాంటి బ్యాటర్లు తోడైతే, బ్యాటింగ్ కు స్వర్గధామమమైన ఉపఖండపు పిచ్ లపై న్యూజిలాండ్ ను ఆపడం కష్టమే.

బ్యాటింగ్ విషయాన్ని పక్కన పెడితే, ప్రస్తుత న్యూజిలాండ్ జట్టు బౌలింగ్ లో మరింత ప్రమాదకరంగా ఉంది. ఆ జట్టులో డఫీ, హెన్రీ, ఫెర్గూసన్, నీషమ్ లాంటి ప్రమాదకర ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. అలాగే స్పిన్ విభాగంలో మిచెల్ సాంట్నర్ లాంటి టాప్ స్పిన్నర్ ఉన్నాడు. ఈ గెలుపుతో గ్రూప్-డి నుంచి న్యూజిలాండ్ సూపర్-8 బెర్త్ దాదాపుగా ఖరారైనట్లే.

ఈ మ్యాచ్ లో యూఏఈ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టు బ్యాటర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు. పటిష్టమైన న్యూజిలాండ్ బౌలింగ్ లైనప్ ను ఎదుర్కొని నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేశారు. టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో యూఏఈకి ఇదే అత్యధిక టీమ్ స్కోర్.



కెప్టెన్ ముహమ్మద్ వసీం (66 నాటౌట్), అలీషాన్ షరాఫు (55) కలిసి యూఏఈకి ఈ రికార్డు స్కోర్ అందించారు. ఆఖర్లో మయాంక్ కుమార్ (21) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 2 వికెట్లు తీయగా.. డఫీ, ఫెర్గూసన్, సాంట్నర్, ఫిలిప్స్ తలో వికెట్ తీశారు.

బెంబేలెత్తిపోయిన యూఏఈ బౌలర్లు

174 పరుగుల లక్ష్య ఛేదనను న్యూజిలాండ్ ఓపెనర్లు ఆచితూచి ప్రారంభించారు. అయితే వీరిద్దరు క్రమంగా గేర్ మార్చి వీలు చిక్కినప్పుడల్లా యూఏఈ బౌలర్లును ఉతికి ఆరేశారు. వీరి ధాటికి రోహిద్ ఖాన్ 3.2 ఓవర్లలో 51 పరుగులు, జునైద్ సిద్దిఖీ 4 ఓవర్లలో 47 పరుగులు, అర్ఫాన్ 3 ఓవర్లలో 36 పరుగులు సమర్పించుకున్నారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ (4-0-27-0) ఒక్కడు కాస్త పొదుపుగా బౌలింగ్ చేశాడు. మొత్తంగా టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ ధాటికి యూఏఈ బౌలర్లు బెంబేలెత్తిపోయారు.



## ‘బాస్’ ఆల్రౌండ్ షో.. పసికూనల పోరులో నెదర్లాండ్స్ గెలుపు

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇవాళ (ఫిబ్రవరి 10) ఉదయం (11 గంటలకు) జరిగిన పోరులో పసికూనలు నెదర్లాండ్స్, నమీబియా తలపడ్డాయి. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో నెదర్లాండ్స్ పైచేయి సాధించింది. బాస్ డి లీడ్ ఆల్ రౌండ్ మెరుపుల కారణంగా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

లీడ్ తొలుత బంతితో (3-0-20-2), ఆతర్వాత బ్యాట్ తో (48 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సత్తా చాటి నెదర్లాండ్స్ను ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ ప్రస్తుత ఎడిషన్లో బోణీ కొట్టింది. ఈ జట్టు తొలి మ్యాచ్ లో పాక్ చేతిలో ఖంగుతింది. మరోవైపు నబీమియాకు ఇదే తొలి మ్యాచ్. తొలి మ్యాచ్ లోనే ఆ జట్టు పరాజయంపాలైంది.

ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జాన్ ఫ్రైలింక్ (30), జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ (42) ఓ మోస్తరు స్కోర్లు సాధించి నమీబియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. మిగతా బ్యాటర్లలో జేజే స్మిట్ (22), కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. నెదర్లాండ్స్ బౌలర్లలో లొగన్ వాన్ బీక్, బాస్ డి లీడ్ తలో 2 వికెట్లు పడగొట్టగా.. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాస్సెన్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్యాన్ని నెదర్లాండ్స్ సునాయాసంగా ఛేదించింది. బాస్ డి లీడ్ అజేయమైన మెరుపు ఇన్నింగ్స్ తో ఆ జట్టును విజయతీరాలకు చేర్చాడు. లీడ్ తో పాటు కొలిన్ ఆకెర్మన్ (32), మైఖేల్ లెవిట్ (28), స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) కూడా రాణించడంతో నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నమీబియా బౌలర్లలో బెర్నాల్ స్కోల్జ్, రూబెన్ ట్రంపెల్మన్, నికోల్ లాఫ్టీకి తలో వికెట్ దక్కింది.

## ప్రతి రోజూ నిన్నే ఎంచుకుంటా..



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇండస్ట్రీలోని మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ ఐడియల్ కపుల్స్ లో వీరు ముందు వరుసలో ఉంటారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట, వైవాహిక జీవితంలో 21 ఏళ్లు పూర్తి చేసుకుని ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ రోజు (ఫిబ్రవరి 10) వారి 21వ పెళ్లి రోజు. ఈ స్పెషల్ అకేషన్ సందర్భంగా నమ్రత తన సోషల్ మీడియాలో ఒక బ్యూటిఫుల్ ఫోటోను షేర్ చేశారు.

**నమ్రత స్వీట్ పోస్ట్..**


తమ 21వ వెడ్డింగ్ యానివర్సరీని పురస్కరించుకుని నమ్రత తన ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో ఒక క్యూట్ ఫోటోను పోస్ట్ చేశారు. ఇది వారు ఒక ఫ్లైట్ జర్నీలో ఉన్నప్పుడు తీసుకున్న త్రోబ్యాక్ ఫోటోలా కనిపిస్తోంది. ఈ ఫోటోలో మహేష్ బాబు ఎప్పటిలాగే హ్యాండ్ సమ్ గా కనిపిస్తుండగా, నమ్రత ఆయన పక్కన కూర్చుని చిరునవ్వు చిందిస్తున్నారు.

ఈ ఫోటోకు నమ్రత ఇచ్చిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఖ్టిజీజూజూ ఛిజొ౦ఙ్జీజ డౌం ఛ్రీఛిటఝ్ఛ్డ ఏ్చఇఙ 21 ఞఙ (ప్రతి రోజూ నిన్నే ఎంచుకుంటాను.. హ్యాపీ 21 ఞఙ) అంటూ తన భర్తపై ఉన్న అంతులేని ప్రేమను వ్యక్తపరిచారు. 21 ఏళ్లు గడిచినా వారి మధ్య ఉన్న ప్రేమ ఇంకా కొత్తగానే ఉందనడానికి ఈ పోస్ట్ నిదర్శనం.

**21 ఏళ్ల ప్రయాణం..**

‘వంశీ’ సినిమా షూటింగ్ సమయంలో మహేష్, నమ్రత మధ్య ప్రేమ చిగురించింది. ఆ తర్వాత పెద్దలను ఒప్పించి 2005, ఫిబ్రవరి 10న వీరు పెళ్లి చేసుకున్నారు. వీరికి గౌతమ్, సితార అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సినిమాలకు దూరంగా ఉన్నా, నమ్రత మహేష్ బాబు కెరీర్ వ్యవహారాలను, కుటుంబ బాధ్యతలను దగ్గరుండి చూసుకుంటున్నారు.

ప్రస్తుతం ఈ ఫోటో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. అభిమానులు, సినీ ప్రముఖులు కామెంట్స్ చేస్తూ ఈ జంటకు విషెస్ చెబుతున్నారు.



## ఎన్నో హిట్లిచ్చిన బ్యూటీ.. కానీ, స్కిన్ షో తప్పడం లేదా?

చిత్రపరిశ్రమలో కథానాయికలు ఎక్కువగా ప్రాముఖ్యతనిచ్చేది అందాల ప్రదర్శనకే అని చెప్పవచ్చు. అవకాశాల కోసం స్కిన్ ప్రదర్శనతో కూడిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తుంటారు. టాప్ హీరోయిన్ గా ఎదిగినా, ఆ స్థానాన్ని నిలుపుకోవడానికి వారికి ఒకే ఒక్క ఆయుధం అందాలారబోతే. నటి రాశీఖన్నా ఇందుకు ఆతీతం కాదు. చూడ చక్కని నటి ఈ బ్యూటీ. అంతే కాదు పాన్ ఇండియా నటి అన్నది అదనపు గుర్తింపు. 2013లో మెద్రాస్ కఫే అనే చిత్రంతో నాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఆ తరువాత తెలుగు, తమిళం తదితర భాషల్లో నటిస్తు మంచి పేరు తెచ్చుకున్నారు.

తమిళంలోకి ఇమైకా నొడిగల్ అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం మంచి విజయాన్నిసాధించింది. అయితే అందులో హీరో అక్కగా నటించిన నయనతార ఆ క్రెడిక్ట్ ను కొట్టేశారు. అయితే నటి రాశీఖన్నాకు ఆ చిత్రం మంచి ఎంట్రీనే అయ్యింది. అలా నటుడు రవిమోహన్ కు జంటగా అడంగుమరు అనే చిత్రంలో నటించారు. ధనుష్ తో కలిసి తిరుచిట్రంఫలం (తిరు) చిత్రంలో క్యామియో పాత్రలో నటించారు. సర్ధార్ చిత్రంలో నటుడు కార్తీకి జంటగా నటించారు. సుందర్.సీ దర్శకత్వంలో అరణ్మణై 4 చిత్రంలో తమన్నాతో పోటీ పడి అందాలను ఆరబోశారు.

విశేషం ఏమిటంటే కోలీవుడ్ లో ఈ అమ్మడు నటించిన చిత్రాలన్నీమంచి సక్సెస్ అయ్యాయి. తెలుగులోనూ హిట్ చిత్రాల్లో నటించారు. అలా నటిగా పుష్కర కాలాన్ని అధిగమించారు. అయినా ఈమెకు స్టార్ ఇమేజ్ రాకపోవడం గమనార్హం. అంతే కాదు ప్రస్తుతం అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో తాజాగా ప్రత్యేక ఫొటో సెషన్ ఏర్పాటు చేసుకుని హాట్ హాట్ ఫొటోలు సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. మరి ఇవి ఎంత వరకు అవకాశాలను తీసుకొస్తాయో చూడాలి.



## అల్లు అర్జున్ టీం నుంచి క్లారిటీ బయటకి వచ్చింది!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు పాన్ ఇండియా నుంచి పాన్ వరల్ మార్కెట్ దిశగా వెళుతున్న సంగతి తెలిసిందే. పుష్ప 2 సినిమాని కూడా ఇటీవల జపాన్ లో రిలీజ్ చేశారు. ఇక నెక్స్ట్ సినిమాల కోసం ఆసక్తికర వార్తలు బయటకి వస్తుండగా తనపై ఓ షాకింగ్ వార్త కూడా తాజాగా బయటకి వచ్చి వైరల్ గా మారింది. సినిమా సెట్స్ లో అల్లు అర్జున్ తో ఇలా ఉండకూడదు అలా ఉండాలి. తన వంక సూటిగా చూడకూడదు. ఇలా చాలానే షాకింగ్ అంశాలు వినిపించాయి.


అయితే ఈ వార్తలపై లేటెస్ట్ గా అల్లు అర్జున్ టీం నుంచి అధికారిక క్లారిటీ బయటకి వచ్చింది. ఒక అధికారిక ప్రెస్ నోట్ ని విడుదల చేసి అల్లు అర్జున్ విషయంలో జరుగుతున్న ఆ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని వారు ఖండించారు. అంతే కాకుండా అల్లు అర్జున అందరితో ఎంతో మర్యాదపూర్వకంగానే ఉంటారని ఇందులో తెలిపారు. ఇక దీనితో పాటుగా తనపై ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తున్న వారిపై ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ ప్రెస్ నోట్ ద్వారా తెలిపారు.

## ఆ హీరో కథను రవితేజ చేస్తున్నాడా?

దర్శకుడు శివ నిర్వాణ ‘నిన్ను కోరి’, ‘మజిలీ’ వంటి చిత్రాలతో టాలీవుడ్ లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా నాగ చైతన్యతో ఆయన చేసిన ‘మజిలీ’ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించడమే కాకుండా, వీరిద్దరి కాంబినేషన్ పై భారీ అంచనాలను పెంచింది. ఈ క్రమంలోనే చైతన్య కోసం శివ నిర్వాణ మరో ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు. అయితే, ‘టక్ జగదీష్’, ‘ఖుషి’ వంటి చిత్రాలు ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడం మరియు చైతన్య తన నిర్ణయాన్ని వెల్లడించడంలో జాప్యం చేయడంతో, ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి సమయం పట్టింది.

చివరికి ఈ స్క్రిప్ట్ తో శివ నిర్వాణ మాస్ మహారాజా రవితేజను సంప్రదించగా, ఆయన వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలా నాగ చైతన్య చేయాల్సిన సినిమా రవితేజ చేతుల్లోకి వెళ్లి ‘ఇరుముడి’గా రూపాంతరం చెందింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే రవితేజ, శివ నిర్వాణలకు అడ్వాన్స్ లు చెల్లించిన ఈ నిర్మాణ సంస్థ, ఈ క్రేజీ కాంబినేషన్ ను సెట్స్ పైకి తీసుకెళ్లి షూటింగ్ ను శరవేగంగా జరుపుతోంది.

ఈ ఏడాదిలోనే విడుదల కానున్న ‘ఇరుముడి’ చిత్రంలో రవితేజను దర్శకుడు సరికొత్త షేడ్ లో ప్రెజెంట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. నాగ చైతన్య రిజెక్ట్ చేసిన ఈ కథ రవితేజకు ఎలాంటి విజయాన్ని అందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయితే చైతన్య ఒక మంచి అవకాశాన్ని వదులుకున్నట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సినిమా ఫలితం తేలే వరకు అక్కినేని అభిమానులు మరియు మాస్ రాజా ఫ్యాన్స్ ఉత్కంఠగా వేచి చూడాల్సిందే.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.